ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అనంతపురం
జిల్లా వార్తలు
గురువారం 11 జూలై 2024



తాత్కాలిక డీఆర్‌ఎంగా విజయకుమార్



గుంతకల్లు, జూలై 10: గుంతకల్లు రైల్వే డివిజన్‌కు తాత్కాలిక డీఆర్‌ఎంగా ఎం విజయకుమార్‌ను నియమిస్తూ రైల్వే బోర్డు ఉత్తర్వులను బుధవారం జారీచేసింది. గతంలో డీఆర్‌ఎంగా ఉన్న వినీత్ కుమార్ అవినీతి కేసులో సీబీఐకి చిక్కిన కారణంగా ఆయన స్థానంలో దక్షిణమధ్య రైల్వే జోన్‌లో ఇండియన్ రైల్వే సర్వీస్ మెకానికల్ ఇంజనీరుగా (నాన్ ఫంక్షనల్ హయ్యర్ అడ్మినిస్ట్రేటివ్ గ్రేడ్) పనిచేస్తున్న ఎం విజయకుమార్‌కు తాత్కాలికంగా డీఆర్‌ఎం విధులను అప్పగించారు. రెగ్యులర్ డీఆర్‌ఎంగా మరొక అధికారి వచ్చేంత వరకూ ఈయన డివిజనల్ రైల్వే మేనేజరుగా కొనసాగుతారు.

నీటి కుంటలో పడి ఇద్దరి మృతి



సజ్జల విష్ణు (ఫైల్)



కంసల నవీన్ (ఫైల్)

చెప్పు కోసం వెళ్లి విద్యార్థి.. అతడిని కాపాడేందుకు వెళ్లి మరొకరు మృతి

కుందుర్పిలో విషాదం

కుందుర్పి, జూలై 10: బడికెళ్లిన బిడ్డ శవంగా వస్తాడని ఆ తల్లిదండ్రులు ఊహించలేదు. కూలి పనులకు పోయిన తమ కొడుకు ఎవరినో కాపాడబోయి మృత్యుఒడికి చేరుతాడని మరో తల్లిదండ్రులు అనుకోలేదు. కాని ఒకే సంఘటనలో బాలుడు, యువకుడు చనిపోవడం రెండు కుటుంబాల్లో విషాదం నింపింది. తన కాలి చెప్పు నీటిలో కొట్టుకుపోతోందని విద్యార్థి కుంటలో దిగి మునిగిపోగా, ఆ బాలుడిని కాపాడబోయి మరో యువకుడు నీట మునిగి మృతి చెందాడు. ఈ సంఘటన కుందుర్పిలో బుధవారం జరిగింది. కుందుర్పికి చెందిన నాగేంద్ర, అనితలక్ష్మి రెండో కుమారుడు సజ్జల విష్ణు (11) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నాడు. ఎప్పటిలాగే పాఠశాలకు వెళ్లిన విద్యార్థి విష్ణు బుధవారం పాఠశాలలో ఇంటర్వెల్ సమయంలో పాఠశాల పక్కనే ఉన్న బద్రికుంటకు విద్యార్థులతో కలిసి బహిర్భూమికి వెళ్లాడు. తిరిగి వచ్చే సమయంలో నీటిలో తన చెప్పులను శుభ్రం చేసుకుంటుండగా ఒక చెప్పు జారిపోయింది.



నీటి కుంట నుంచి విద్యార్థిని బయటకు తెస్తున్న గ్రామస్థులు

దానిని తీసుకునే క్రమంలో ప్రమాదవశాత్తు నీటి కుంటలో పడిపోయాడు. ఒడ్డున ఉన్న విద్యార్థులు కేకలు వేయడంతో పక్కనే బండలు కొట్టేందుకు కూలి పనులకు వెళ్లిన కంసల నవీన్ (26) అక్కడికి వచ్చాడు. మునిగిపోతున్న విష్ణును కాపాడేందుకు తనకు ఈత రాకపోయినా, లోతు అంచనా వేయకుండానే కుంటలో దిగాడు. నీటి కుంట మధ్యలో లోతు ఎక్కువగా ఉండటంతో విద్యార్థితో పాటు అతను కూడా నీటిలో మునిగిపోయాడు. ఒడ్డున వున్న విద్యార్థులు కేకలు వేస్తూ పాఠశాల ఉపాధ్యాయులకు సమాచారం అందించారు. ఉపాధ్యాయులు, గ్రామస్థులు పెద్దఎత్తున అక్కడకు చేరుకుని కుంటలో నుంచి ఇద్దరిని బయటకు తీసుకొచ్చారు. కొన ఊపిరితో వున్న విష్ణు, నవీన్‌లను స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఇద్దరూ మృతి చెందారు. దీంతో నవీన్ తల్లిదండ్రులు కంసలి రామాచారి, కంసలి లక్ష్మీదేవి, విష్ణు తల్లిదండ్రులు బోరున విలపించారు. మృతదేహాలను కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. డిప్యూటీ డీఈవో శ్రీనివాసరావు హుటాహుటిన కుందుర్పికి చేరుకుని విద్యార్థి మృతి చెందిన ప్రాంతాన్ని పరిశీలించారు. దీనిపై కుందుర్పి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పాఠశాలలో సౌకర్యం లేకనే బయటకు..

జడ్పీ ఉన్నత పాఠశాలలో దాదాపు 600 మంది విద్యార్థులు ఉన్నారు. అయితే వారికి మరుగుదొడ్డి సౌకర్యం లేదు. గత మూడేళ్లుగా నాడు- నేడు పనుల కింద లక్షలు వెచ్చించినా మరుగుదొడ్డి సౌకర్యాన్ని విద్యార్థులకు కల్పించలేకపోయారు. అందుకే బహిర్భూమికి సమీప బద్రికుంటలోకి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

పెద్దసార్ యాడున్నాడో?



అడ్రస్ లేని ప్రిన్సిపాల్.....!

కణేకల్లు మోడల్ స్కూల్‌లో ఇష్టారాజ్యం
వ్యవహారం చక్కబెడుతున్న సీనియర్ పీజీటీ



మోడల్ స్కూల్

అనంతపురం విద్య, జూలై 10: వేసవి సెలవులు ముగిసిన తర్వాత విద్యాలయాలు ప్రారంభమయ్యి నెల రోజులు దాటింది. అయితే కణేకల్లు మోడల్ స్కూల్ ప్రినిపాల్ మాత్రం అడ్రస్ లేకుండా పోయారు. జూనియర్ కళాశాలలు జూన్ ఒకటో తేదీ నుంచి ప్రారంభమయ్యాయి. అయితే ఇప్పటి వరకూ ఆయన స్కూల్‌కు వచ్చిన దాఖలాలు లేవు. ఆయన రాకున్నా వచ్చినట్టు సంతకాలు మాత్రం ఉంటాయి. అటెండెన్స్ రిజిస్టర్‌లో సైతం ప్రిన్సిపాల్ సంతకాలు ఉంటాయి.

స్కూల్ మొహం చూడని ప్రిన్సిపాల్

కణేకల్లు మోడల్ స్కూల్‌కు ప్రిన్సిపాల్ చాలా కాలంగా రావడం లేదు. గతంలో చాలా నెలలు స్కూల్‌లో అందుబాటులో లేడన్న విమర్శలున్నాయి. గత నెల ఒకటో తేదీ నుంచి మోడల్ స్కూల్‌లో క్లాసులు ప్రారంభమయ్యాయి. అయినా...ఆయన అడుగు పెట్టలేదు. ఇప్పుడు జూలైలో కూడా 10 రోజులు గడిచిపోయాయి. అయినా ఇప్పటి వరకూ స్కూల్ మొహం చూసింది లేదు. కానీ ఆయన జూన్‌లో 11వ తేదీ వరకూ అటెండెన్స్‌లో సంతకాలు చేసినట్టు ఉంది. ఆ తర్వాత ఆయన ఈ రోజు వరకూ ఎలాంటి సంతకాలు చేయలేదు. ఆయన స్కూల్‌కు రాకున్నా మరో సీనియర్ పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచరే (పీజీటీ) ప్రిన్సిపాల్ సంతకాలను 11వ తేదీ వరకూ చేసినట్టు సమాచారం. ప్రస్తుతం గత నెలన్నరగా మోడల్ స్కూళ్లలో అడ్మిషన్లు సాగుతున్నాయి. ఇలాంటి సమయంలో ప్రిన్సిపాల్ అందుబాటులో ఉండాలి. కానీ ఆయన అజ్ఞాతంలో ఉన్నారు. అడ్మిషన్ల కోసం, ఇతర పనులపై స్కూల్‌కు వచ్చే విద్యార్థులకు తల్లిదండ్రులు సమాధానం కరువైంది.

షాడో ప్రిన్సిపాల్...

స్కూల్‌లో పనిచేసే మరో సీనియర్ పీజీటీ అంతా తానై షాడో ప్రిన్సిపాల్‌లా పనిచేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. మోడల్ స్కూల్‌లో సుమారు 550 మందికి పైగా విద్యార్థులున్నారు. రెగ్యులర్ స్టాఫ్ 16 మందితో పాటు మరో 10 మంది ఇతర సిబ్బంది ఉన్నారు. బాధ్యతగా పనిచేయాల్సిన ప్రిన్సిపాల్ అడ్రెస్ లేకపోవడంపె అనేక విమర్శలు వస్తున్నాయి. అయితే సీనియర్ పీజీటీనే ప్రిన్సిపాల్ మాదిరి సంతకాలు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. రిజిస్టర్‌లో ఫోర్జరీ సంతకాలు చేయడంతోపాటు, కొందరు విద్యార్థుల టీసీలపై కూడా ఆయనే సంతకాలు పెడుతున్నట్లు సమాచారం. స్కూల్‌లో అనేక సమస్యలున్నా...స్కూల్‌కు రాకుండా ఉన్న ప్రిన్సిపాల్‌కు ఎవరు ఫోన్లు చేసినా...ఎత్తడం లేదని, స్కూల్‌లోని షాడో పీజీటీ ఫోన్ చేస్తేనే ఎత్తుతారన్న విమర్శలు వస్తున్నాయి. అడ్డగోలుగా వ్యవహరిస్తూ...స్కూల్‌కు రాకుండా విధులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ప్రిన్సిపాల్ పై ఇటు జిల్లా విద్యాశాఖాధికారులు కానీ, అటు ఆర్‌జేడీ కార్యాలయ అధికారులు గానీ చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



కొలువుదీరిన కుళ్లాయిస్వామి పీర్లు

కొలువుదీరిన కుళ్లాయిస్వామి

మతసామరస్యానికి ప్రతీకగా నిలిచిన గూగూడు కుళ్లాయిస్వామి పీర్ల మకానంలో బుధవారం కొలువుదీరాయి. తెల్లవారుజామున కుళ్లాయిస్వామి పీర్లను బంగారు ఆభరణాలు, పలు రకాల పూలు, వెండి గొడుగులతో ప్రత్యేకంగా అలంకరించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి వేలాది మంది భక్తులు కుళ్లాయిస్వామిని దర్శించుకుని చక్కెర చదివించారు. ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి శోభ, దేవదాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

- నార్పల

రాజకీయ కక్షతోనే ఆదికేశవులు హత్య

టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడుయాదవ్




కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు

రాయదుర్గంరూరల్, జూలై 10: రాజకీయ కక్షతోనే తమ పార్టీ నాయకుడు ఆదికేశవులును హత్య చేశారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడుయాదవ్ మండిపడ్డారు. బుధవారం ఆయన మెచ్చిరి గ్రామంలో ఆదికేశవులు మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహంపై పార్టీ జెండా కప్పి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను ఓదార్చి, అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రశాంతమైన గ్రామంలో వైసీపీ నాయకులు చిచ్చుపెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకనైనా హత్యా రాజకీయాలు మానుకోవాలన్నారు. హత్యకు సంబంధం ఉన్న నిందితులకు శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ హనుమంతు, టీడీపీ నాయకులు సోమశేఖర్, గిరిధర్‌నాయుడు, బట్టి తిప్పేస్వామి, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

ఆధిపత్యం కోసమే..: కాలవ

రాయదుర్గం: రాష్ట్రంలో అధికారం కోల్పోయిన వైసీపీ నాయకులు పల్లెల్లో ఆధిపత్యం నిరూపించుకోవడం కోసం హత్యా రాజకీయాలకు పాల్పడుతున్నారని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు బుధవారం ఓ ప్రకటనలో ధ్వజమెత్తారు. మంగళవారం రాత్రి మెచ్చిరిలో టీడీపీ నాయకుడు ఆదికేశవులును వైసీపీ నాయకులు హతమార్చడాన్ని హేయమైన చర్యగా పేర్కొన్నారు. నిందితులు ఎంతటి వారైనా ఉపేక్షించబోమని, వారికి కఠినంగా శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామన్నారు. మృతుడి కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామన్నారు.

చీనీ @ రూ.18వేలు



అనంతపురం రూరల్, జూలై 10: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.18వేలు, కనిష్ఠంగా రూ.10వేలు, సరాసరి రూ.14వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 904టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

కుటుంబ ప్రణాళికతోనే దేశాభివృద్ధి



ప్రపంచ జనాభా దినోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌ఓ ఈబీ దేవి తదితరులు

డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈబీ దేవి

అనంతపురం టౌన్, జూలై 10: కుటుంబ ప్రణాళికతోనే దేశ అభివృద్ధి సాధ్యమని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈబీ దేవి అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవంపై జిల్లా వైద్యాధికారులు బుధవారం జిల్లా కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. తొలుత పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ దేశ ప్రగతికి జనాభాతోపాటు ఆరోగ్యం కూడా చాలా ముఖ్యమన్నారు. అందుకే తల్లిదండ్రులు ప్రసవానికి ప్రసవానికి మధ్య కనీసం మూడేళ్ల ఎడబాటు ఉండేలా ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. అప్పుడే తల్లి బిడ్డ ఆరోగ్యంగా క్షేమంగా ఉంటారన్నారు. కుటుంబ నియంత్రణకు సంబంధించి ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు తగిన సేవలు అందజేస్తారని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో ఆర్ట్స్ కళాశాల నుంచి సప్తగిరి సర్కిల్ వరకు ప్రపంచ జనాభాపై భారీ అవగాహన ర్యాలీ నిర్వహిస్తామన్నారు. కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటించిన దంపతులు, అందుకు సేవలందించిన వైద్యసిబ్బందికి అవార్డులు, ప్రశంసాపత్రాలు అందించి సత్కరిస్తామని డీఎంహెచ్‌ఓ తెలిపారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ సుజాత, డెమోలు త్యాగరాజు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్చెల్సీకి 28 తర్వాతే నీరు

కణేకల్లు, జూలై 10: హెచ్చెల్సీకి ఈ నెల 28 తర్వాతే సాగునీరు వచ్చే అవకాశం ఉందని ఎస్‌ఈ రాజశేఖర్ తెలిపారు. మండల కేంద్రంలోని శ్రీచిక్కణ్ణేశ్వర చెరువు వద్ద ఉన్న షెట్టర్లను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్‌ఈ మాట్లాడుతూ ప్రస్తుతం తుంగభద్ర డ్యాంలో 25 టీఎంసీల నీరు ఉందని, 40 టీఎంసీల నీరు రాగానే డ్యాం అధికారులు హెచ్చెల్సీకి నీటి విడుదల చేస్తారన్నారు. తమ అంచనా ప్రకారం మరో 15 రోజుల్లోపు 40 టీఎంసీల నీరు డ్యాంలోకి చేరే అవకాశం ఉందన్నారు. అలాగే హెచ్చెల్సీ 112, 119, 181 కి.మీ. వద్ద మరమ్మతు పనులను చేస్తున్నామని మరో రెండురోజుల్లోపు అవి పూర్తవుతా యన్నారు. హెచ్చెల్సీ పరిధిలో తాడిపత్రి వరకు దాదాపు 25 అత్యవసర పనులకు సంబంధించి రూ.2.92 కోట్ల ప్రతిపాదనలు పెట్టామని, ఆ నిధులు రాగానే పనులు ప్రారంభిస్తామని వెల్లడించారు. హెచ్చెల్సీలో శాశ్వత పనుల కోసం రూ.34 కోట్లతో ప్రతిపాదనలు పంపగా వాటిని రీమోడలైజ్ చేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చినట్లు ఎస్‌ఈ వివరించారు. చిక్కణ్ణేశ్వరచెరువు షట్టర్ల వద్ద కల్వర్టు పడిపోయినందున కాలువకు నీరు వస్తే గంగలాపురం, రచ్చుమర్రితో పాటు ఆయకట్టు భూముల రైతుల రాకపోకలకు ఇబ్బందిగా ఉంటుందని, ప్రత్యామ్నాయచర్యలు చేపట్టాలని స్థానిక టీడీపీ నాయకులు ఎస్‌ఈని కోరారు. కార్యక్రమంలో ఈఈ వెంకటరమణారెడ్డి, డీఈ మద్దిలేటి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



కణేకల్లు చెరువు వద్ద హెచ్చెల్సీ అధికారులు




దేవగిరి క్రాస్ వద్ద డిస్ట్రిబ్యూటరీ పనులు

మరమ్మతు పనులు వేగవంతం చేయండి

బొమ్మనహాళ్: హెచ్చెల్సీలో మరమ్మతు పనులను వేగవంతం చేయాలని ఎస్‌ఈ రాజశేఖర్ సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని దేవగిరి క్రాస్, డీ.హీరేహాళ్ మండలం చెర్లోపల్లి వద్ద జరుగుతున్న యూటీ, కోతకు గురైన కాలువ గట్టు, 1వ డిస్ట్రిబ్యూటరీ పనులను ఎస్‌ఈ రాజశేఖర్, ఈఈ రమణారెడ్డి బుధవారం పరిశీలించారు. 119/638 కి.మీ., చెర్లోపల్లి వద్ద దెబ్బతిన్న యూటీ, దేవగిరిక్రాస్ వద్ద డిస్ట్రిబ్యూటరీ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఎస్‌ఈ మాట్లాడుతూ ప్రస్తుతం అత్యవసరమైన చోట మాత్రమే పనులు చేస్తున్నామన్నారు. 112 కి.మీ. వద్ద దెబ్బతిన్న కాలువగట్టు పనులు ఇప్పటికే పూర్తి అయ్యినట్లు తెలిపారు. తుంగభద్ర జలాశయం నుంచి నీరు విడుదల కానున్న నేపథ్యంలో త్వరగా మరమ్మతు పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించినట్లు వెల్లడించారు.

టీబీ డ్యాంలో 25 టీఎంసీల నీరు

బొమ్మనహాళ్, జూలై 10: తుంగభద్ర జలాశయంలో మంగళవారానికి 25.17 టీఎంసీల నీటి నిల్వ ఉంది. ఇన్‌ఫ్లో బుధవారం 27,544 క్యూసెక్కులు , ఔట్‌ఫ్లో 199 క్యూసెక్కులు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. వరదనీరు ప్రవాహం హెచ్చుతగ్గులతో వస్తున్నా రోజుకు రెండు టీఎంసీల మేర నీరు జలాశయంలోకి చేరుతోంది.



టీబీ డ్యాంలో వరద నీరు



ఎస్కేయూ జన్మభూమి క్యాంటిన్

అద్దె వసూలు చేసేరా..?

జన్మభూమి క్యాంటిన్ అద్దె చెల్లించని నిర్వాహకులు

రూ. రెండు లక్షలకు పైగా బకాయి

అనంతపురం సెంట్రల్, జూలై 10: అధికారం అండతో రెండేళ్ల కిందట ఎస్కేయూలోని జన్మభూమి క్యాంటిన్ స్వాధీనం చేసుకున్న వైసీపీ నాయకులు ఏడాదిగా అద్దె కూడా చెల్లించడం లేదు. కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో ఈ విషయం బయటపడింది. అధికారులు నోటీసులిచ్చినా వైసీపీ నాయకుల నుంచి ధిక్కారమే ఎదురవుతోంది. దీంతో విద్యుత్ కనెక్షన్ కట్ చేయాలని ఇంజనీరింగ్ విభాగాన్ని వర్సిటీ అధికారులు ఆదేశించారు. విద్యార్థులు, ఉద్యోగులు, సిబ్బంది ఆహార అవసరాలు తీర్చేందుకు వర్సిటీ క్యాంపస్‌లో జన్మభూమి క్యాంటిన్ ఏర్పాటుచేశారు. వందలాది మందితో ఈ క్యాంటిన్ నిత్యం రద్దీగా ఉంటుంది. వ్యాపారం బాగా జరుగుతుందని వైసీపీ నాయకులే క్యాంటిన్ నిర్వహణను చేజిక్కించుకున్నారు. నెలకు రూ.20వేల చొప్పున అద్దె చెల్లించేలా టెండర్ ద్వారా కట్టబెట్టారు. ఈ మొత్తాన్ని కూడా సక్రమంగా చెల్లించకుండా వస్తున్నారు. దాదాపు రూ.2లక్షలకు పైగా అద్దె బకాయి ఉన్నట్లు వర్సిటీ అధికార వర్గాలు చెబుతున్నాయి. ఇలాంటి వాటిపై కూటమి ప్రభుత్వం త్వరతగతిన స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

మూసివేయిస్తాం



సకాలంలో అద్దె చెల్లించకుంటే నిబంధనల ప్రకారం క్యాంటిన్ మూసివేయించి, స్వాధీనం చేసుకుంటాం. ఇప్పటికే రూ.2లక్షలకు పైగా బాడుగ రావాల్సి ఉంది. త్వరతగతిన చెల్లించాలని నిర్వాహకులకు నోటీసులిచ్చాం. విద్యుత్ సరఫరా నిలిపివేయాలని ఇంజనీరింగ్ విభాగం అధికారులకు ఆదేశాలిచ్చాం. టెండర్ పిలిచేవరకు వర్సిటీలో ఆహార అవసరాల సమస్య లేకుండా చూడాలన్న సదుద్దేశంతోనే కఠిన చర్యలకు ఉపక్రమించడం లేదు.

- ప్రొఫెసర్ ఎంవీ లక్ష్మయ్య, ఎస్కేయూ రిజిస్ట్రార్

రైతులకు అందుబాటులో ఉండండి

జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ

అనంతపురం అర్బన్, జూలై 10: వ్యవసాయ అధికారులు క్షేత్ర స్థాయిలో రైతులకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించాలని జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ ఆదేశించారు. బుధవారం స్థానిక జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలోని తన చాంబర్‌లో ఏడీఏలు, ఏఓలతో ఆమె సమావేశమయ్యారు. ఈ సారి ఖరీఫ్‌లో మండలాల వారిగా సాగైన పంటల వివరాలపై ఆరా తీశారు. ఎరువులు, పురుగు మందులు, విత్తనాల షాపుల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టి, నిబంధనల అతిక్రమణలపై చర్యలు తీసుకోవాలన్నారు. నిర్దేశించిన లక్ష్యం మేరకు శాంపిళ్లు సేకరించి, పరీక్ష కేంద్రాలకు పంపాలన్నారు. భూసార పరీక్షల కోసం మట్టి నమూనాలు సేకరించి, భూసార పరీక్షా కేంద్రానికి పంపాలన్నారు. పెండింగ్‌లోని 5 శాతం పీఎం కిసాన్ వెరిఫికేషన్‌ను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. రైతు సేవా కేంద్రం సిబ్బంది క్షేత్ర స్థాయిలో పర్యటించి, గ్రామాల వారిగా రైతులు ఏఏ రకాల పంటలు సాగు చేశారు..? తదితర వివరాలను పంపాలన్నారు.

ఎవరినీ వదలొద్దు: ఎస్పీ

రాయదుర్గం, జూలై 10: మండలంలోని మెచ్చిరి గ్రామానికి చెందిన ఆదికేశవులు హత్య కేసులో నిందితులను త్వరితగతిన అరెస్టు చేయాలని జిల్లా ఎస్పీ గౌతమిశాలి ఆదేశించారు. హత్య జరిగిన స్థలాన్ని ఆమె బుధవారం పరిశీలించారు. కేసు దర్యాప్తులో పురోగతి సాధించేందుకు తగు సూచనలు చేశారు. హత్య జరిగిన విధానం, అనుమానితుల గురించి ఆరా తీశారు. ఎవరినీ వదలకుండా దర్యాప్తు వేగంగా పూర్తి చేయాలన్నారు.

నిందితులను పట్టుకుంటాం: డీఎస్పీ



రాయదుర్గం రూరల్: మండలంలోని మెచ్చిరి గ్రామంలో మంగళవారం రాత్రి టీడీపీ నాయకుడు ఆదికేశవులును హత్య చేసిన నిందితులను పట్టుకుంటామని కళ్యాణదుర్గం డీఎస్పీ శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం పోలీస్‌స్టేషన్ వద్ద విలేకరులతో మాట్లాడారు. హత్యకు సంబంధించి నిందితులను పట్టుకునేందుకు నాలుగు ప్రత్యేక బృందాలను దింపి సాక్ష్యాలను సేకరించామన్నారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు.

రోడ్డుపై మృతుడి బంధువుల బైఠాయింపు



ఆసుపత్రి వద్ద ధర్నా నిర్వహిస్తున్న మృతుడి బంధువులు

ఆదికేశవులును హత్యచేసిన నిందితులను త్వరగా పట్టుకుని, శిక్షించాలని కుటుంబసభ్యులు, బంధువులు డిమాండ్ చేశారు. బుధవారం ఆసుపత్రి వద్ద రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. తమ తండ్రి ఏ పాపం చేశాడని అతి కిరాతకంగా హత్య చేశారని ఆదికేశవులు కూతురు అక్షయ, కొడుకు కార్తీక్ ప్రశ్నించారు. నిందితులను అదుపులోకి తీసుకొని కఠిన శిక్ష పడేలా చూడాలన్నారు. టీడీపీ మండల కన్వీనర్‌లు హనుమంతు, హనుమంతరెడ్డిలు డీఎస్పీతో చర్చించారు. డీఎస్పీ నిరసనకారులను నచ్చజెప్పి ఆందోళన విరమింప చేయించారు.

ఆధిపత్యం కోసమే హత్య

వరుస సంఘటనలతో బలపడిన ఆదికేశవులు నాయకత్వం

వైసీపీ నాయకులే సూత్రధారులని అనుమానం

రాయదుర్గం, జూలై 10: తెలుగుదేశం పార్టీలో క్రియాశీలకంగా ఉండే ఆదికేశవులును హతమారిస్తే గ్రామంలో తమ ఆధిపత్యానికి తిరుగు ఉండదనే భావనతోనే హత్య చేసినట్లు తెలుస్తోంది. రెండేళ్లుగా మెచ్చిరి గ్రామంలో రెండు సామాజిక వర్గాల మధ్య ఆధిపత్య పోరు నడుస్తోంది. రెండు వర్గాలు రెండు ప్రధాన పార్టీల్లో చేరి ఒకరిపై ఒకరు దాడులకు పాల్పడటం జరుగుతుండేది. పైగా మెచ్చిరి గ్రామంలో ఎప్పుడూ వైసీపీకి ఆధిక్యం వచ్చేది. కానీ ఈ సారి జరిగిన ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి మెజార్టీ రావడం లాంటివన్నీ ఆదికేశవులు హత్యకు మూలాలుగా అనుమానిస్తున్నారు. దీంతో పాటు గ్రామంలో ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో అర్చకులకు సంబంధించిన వివాదంలో కూడా ఒక వర్గం అర్చకుల వెంట ఉండి పైచేయి సాధించింది. దీనంతటికి ఆదికేశవులే కారణమని, తమ ఆధిపత్యానికి అడ్డుగా ఉన్న ఆయన్ను హతమార్చడమే ప్రత్యర్థులు ఏకైక లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది.

ఆదికేశవులు నాయకత్వాన్ని జీర్ణించుకోలేకే..

గ్రామంలో రెండు వర్గాల మధ్య ఉన్న ఆధిపత్యపోరులో ఒక వర్గానికి ఆదికేశవులు నాయకుడుగా ఉన్నారు. మరో వర్గానికి సర్పంచ్ చంద్రతో పాటు కృష్ణారెడ్డి నాయకత్వం వహిస్తున్నారు. రెండేళ్ల కిందట ఇరువర్గాల మధ్య పెద్ద ఎత్తున ఘర్షణ జరిగింది. ఇళ్లల్లో చొరబడి దాడులు సైతం చేసుకున్నారు. వైసీపీ అధికారంలో ఉండటంతో తెలుగుదేశం పార్టీకి చెందిన ఆదికేశవులుతో పాటు మరో కొంతమందిపై హత్యాయత్నం కేసులు కూడా నమోదయ్యాయి. అర్చకులకు సంబంధించిన వివాదంలో కూడా కోర్టు ఉత్తర్వులు ఉన్నప్పటికీ అర్చకులకు ఆలయంలోకి ప్రవేశం కల్పించాలని ఆదేశించినా వైసీపీ అధికారంలో ఉన్నంత వరకు వారికి అనుమతించకుండా అడ్డుకోవడంలో వైసీపీ నాయకులు సఫలీకృతులయ్యారు. ఇలాంటి వివాదాలన్నీ ఒక్కొక్కటిగా ఆదికేశవులు నాయకత్వాన్ని బలపరుస్తూ వచ్చాయి. ఈక్రమంలోనే ఇటీవల తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడం, ఎప్పుడూ లేని మెజార్టీ సైతం గ్రామంలో టీడీపీకి దక్కింది. దీంతో ఆదికేశవులు నాయకత్వానికి మరింత బలం చేకూరింది. దీనిని జీర్ణించుకోలేని వైసీపీ నాయకులు ఆదికేశవులును అడ్డుతొలగించుకోవాలనే సంకల్పానికి వచ్చినట్లు కనిపిస్తోంది. ఇందుకు గ్రామం వదిలి వెళ్లిపోయిన కేశవరెడ్డిని రంగంలోకి దింపినట్లు సమాచారం.

కేశవరెడ్డిపైనే అనుమానాలన్నీ..

మెచ్చిరి గ్రామానికి చెందిన పెద్దిరెడ్డి కొడుకు కేశవరెడ్డిపైనే పోలీసులకు అనుమానం కలుగుతోంది. తండ్రినే హతమార్చేందుకు యత్నించిన చరిత్ర కేశవరెడ్డిది. ఆస్తి వివాదంలో తండ్రినే హతమార్చేందుకు ప్రయత్నించడం అప్పట్లో చర్చనీయాంశమైంది. అప్పటి నుంచి కుటుంబానికి దూరంగా కర్ణాటకలో ఉంటున్నాడు. అక్కడ జరిగిన హత్యలో కూడా కేశవరెడ్డి పాల్గొన్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. దీంతో గ్రామంలో ఉన్న కొందరు వైసీపీ నాయకులు కేశవరెడ్డిని ఆశ్రయించి తమ సామాజిక వర్గ ఆధిపత్యానికి అడ్డుగా ఉన్న ఆదికేశవులును హతమార్చేందుకు ఒప్పించినట్లు గ్రామంలో చర్చించుకుంటున్నారు. దీనికి అంగీకరించిన కేశవరెడ్డి తనతో పాటు నేర చరిత్ర కలిగిన మరో ఐదుగురిని సిద్ధం చేసుకుని గ్రామంలో వారంరోజుల పాటు మకాం వేసినట్లు తెలుస్తోంది. గ్రామ సరిహద్దులో ఉన్న తోటల్లో ఉంటూ ఆదికేశవులు కదలికలపై నిఘా ఉంచినట్లు సమాచారం. మంగళవారం రాత్రి ఒంటరిగా ప్రయాణిస్తున్న ఆదికేశవులును వెంబడించి హతమార్చినట్లు చర్చ జరుగుతోంది. వారంరోజుల పాటు గ్రామస్థులకు కనిపించిన కేశవరెడ్డి హత్య తర్వాత కనిపించడం లేదు. దీంతో అతడిపై గ్రామస్థులు బలంగా అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

యువతి అదృశ్యం



రంగమ్మ (ఫైల్)

తాడిపత్రి, జూలై 10: పెద్దపప్పూరు మండలంలోని జూటూరుకు చెందిన రంగమ్మ అనే యువతి రెండురోజుల నుంచి కనిపించడం లేదని బుధవారం ఫిర్యాదు అందినట్లు పెద్దపప్పూరు పోలీసులు తెలిపారు. తన కుమార్తె రంగమ్మ ఈనెల 9వ తేదీన ఇంటి నుంచి ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయిందని ఆమె తండ్రి జూటూరుకు చెందిన నారా యణ రెడ్డి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. రంగమ్మకు మతిస్థిమితం కూడా సరిగా లేదని ఫిర్యాదులో పేర్కొన్నాడన్నారు. ఆచూకీ తెలిసిన వారు సెల్ ఫోన్ నంబర్ 9848113255 కు తెలయజేయాలని పోలీసులు కోరారు.

ప్రాణాలు తీసిన పల్లె గొడవలు

- చిన్నారిని నీటితొట్టెలో వేసి.. తల్లి ఆత్మహత్య
- అనంతపురం జిల్లాలో విషాద ఘటన



భర్త శాంతకుమార్‌తో మమత, కూతురు(ఫైల్)

కళ్యాణదుర్గం రూరల్, జూలై 10: మండల పరిధిలోని మల్లికార్జునపల్లిలో బుధవారం విషాద ఘటన చోటుచేసుకుంది. ఎనిమిది నెలల కూతురిని నీటి తొట్టెలో వేసి.. మమత(24) అనే మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన మేరకు, మల్లికార్జునపల్లిలో నాలుగు రోజుల క్రితం రెండు వర్గాల మధ్య గ్రామ రాజకీయాల నేపథ్యంలో గొడవలు జరిగాయి. ఆ సమయంలో కులం పేరుతో దూషించినందుకు శాంతకుమార్ అనే వ్యక్తిపై వైరి వర్గంవారు పోలీసులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. దీంతో తన భర్తపై కేసు పెడితే తన భవిష్యత్తు ఏమౌతుందోనని శాంతకుమార్ భార్య మమత ఆందోళనకు గురైంది. ఈ నేపథ్యంలో తన ఎనిమిది నెలలు కూతురుని బుధవారం బాత్రూమ్‌లో ఉన్న నీటి తొట్టెలో పడేసి, తాను అక్కడే ఉరి వేసుకుంది. ఎంతసేపటికీ బయటకు రాకపోవడంతో కుటుంబ సభ్యులు, చుట్టుపక్కల వారు బాత్రూమ్ తలుపులు బద్దలుకొట్టి చూశారు. అప్పటికే ఇద్దరూ మృతిచెందారు. కళ్యాణదుర్గం పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వేరుశనగకు తెగుళ్లు

పైరును ఆశించిన ఆకుముడుత, పచ్చపురుగు

ఆందోళనలో రైతులు



వేరుశనగ పంటకు ట్రాక్టరుతో మందు పిచికారి చేస్తున రైతు



పంటను ఆశించిన పచ్చపురుగు

గుత్తి రూరల్, జూలై 10: రైతులు పంటలను సాగు చేస్తున్నారో లేదో అప్పుడే ఆ పంటలకు తెగుళ్లు సోకుతున్నాయి. వేరుశనగ పంటను ఆకుముడుత పురుగు ఆశించింది. పసి దశలో ఉన్న పైరును చుట్టిముట్టేస్తున్నాయి. దీనికి తడు పచ్చపురుగుసైతం ఆశిచింది. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలవ్యాప్తంగా 9,800 హెక్టార్లలో పంట సాగు చేయాల్సి ఉంది. అయితే 1495 హెక్టార్లలో మాత్రమే సాగు చేశారు. వేరుశనగ, పత్తి, ఆముదం, కంది పంటలను రైతులు సాగు చేశారు. మండలంలోని గొందిపల్లి, జక్కలచెరువు, గాజులపల్లి, తొండపాడు, టీ. కొత్తపల్లి, కొత్తపేట, వన్నేదొడ్డి, ఎంగిలిబండ, ఇసురాళ్లపల్లి, కరిడికొండ, ఊబిచేర్ల, ఈశ్వరపల్లి, తదితర గ్రామాల్లో వేరుశనగ పంటలు సాగు చేశారు. వాతావరణ మార్పులో కారణంగా వేరుశనగ పంటను తెగుళ్లు చుట్టుముట్టాయి.

ఆకుముడత వ్యాపించింది..



రెండు ఎకరాలో జూన్ 18న వేరుశనగ పంట సాగు చేశాను. ఆకుముడత తెలుగు పంటకు సోకింది. మందు పిచికారి చేసినా ఫలితం లేదు. వాతావరణ మార్పులతో పంటలో ఎదుగుదల లేదు.

- నాగేంద్ర, రైతు, కొత్తపేట

పచ్చపురుగు ఆశించింది..



ఐదు ఎకరాల్లో వేరుశనగ పంట సాగు చేశా. 23 రోజుల పైరును పచ్చపురుగు అశించింది. పురుగుల మందు పిచ్చికారి చేశాను. మరోసారి కొనడానికి డబ్బులు లేవు. ప్రభుత్వం పురుగు మందులను సబ్సిడీతో అందించాలి.

- నాగేష్, రైతు, జక్కలచెరువు

మందులను పిచికారి చేయాలి

తెగుళ్ల నివారణకు చర్యలను రైతులు తీసుకోవాలి. ఆకుముడత తెగులు ఆశించి ఉంటే ఎకరానికి 500 ఎంఎల్ క్లోరోపైరిపాస్, 300 గ్రాములు అస్సేట్ పొడి మందును పిచికారి చేయాలి. పచ్చపురుగు నివారణకు ఎకరానికి ఎమామెక్టిన్ బెంజోయేట్ 100గ్రాములు చొప్పున స్ప్రే చేయాలి. పురుగు ఉధృతను బట్టి వారం రోజుల వ్యవధిలో మరోసారి పిచికారి చేయాల్సి ఉంటుంది.

- ముస్తాక్ అహమ్మద్, వ్యవసాయాధికారి, గుత్తి

అభివృద్ధి పథంలో నడిపిస్తాం

రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత



మాట్లాడుతున్న మంత్రి సవిత

అనంతపురం అర్బన్, జూలై 10: ప్రజాప్రతినిధుల సహకారంతో ఉమ్మడి జిల్లాను అభివృద్ధి బాటలో నడిపిస్తామని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యేలు దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, బండారు శ్రావణి శ్రీ, ఎంఎస్ రాజుతో కలిసి బుధవారం ఆమె మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ఎన్డీఏ కూటమిని భారీ మెజార్టీతో గెలిపించడంతోపాటు ఉమ్మడి అనంత జిల్లాలో 14 ఎమ్మెల్యే, రెండు ఎంపీ సీట్లు గెలిపించడం చాలా సంతోషంగా ఉందన్నారు. గతంలో టీడీపీ హయాంలో చేసిన అభివృద్దే రాష్ట్రంలో కనిపిస్తోందన్నారు. వైసీపీ హయాంలో దోచుకోవడం, దాచుకోవడంపైనే దృష్టి పెట్టారన్నారు. ఇసుక, ల్యాండ్, మైనింగ్ మాఫియాతో రాష్ట్రాన్ని లూటీ చేశారన్నారు. వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యమైందన్నారు. ప్రజలు ఏ నమ్మకంతో ఓట్లు వేసి గెలిపించారో ఆ నమ్మకాన్ని ఎన్డీఏ కూటమి నిలబెట్టుకుంటుందన్నారు. అనంత జిల్లాలో సాగునీటి ప్రాజెక్టు పనులు చేపట్టడంతోపాటు పరిశ్రమలు తీసుకొస్తామన్నారు. అనంతను హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక చొరవ చూపుతామన్నారు.

అనంత అంటే చంద్రబాబుకు ప్రేమ

కరువు జిల్లా అనంతపై చంద్రబాబుకు ప్రేమ ఎక్కువని, అందుకే ఈ జిల్లాకు కృష్ణా జలాలు తీసుకొచ్చి అపర భగీరథుడిగా నిలిచారన్నారు. హాస్టళ్లలో డైట్ బిల్లులు ఇవ్వలేని దుస్థితిలో గత ఐదేళ్ల పాలన సాగిందన్నారు. బడుగు, బలహీన వర్గాలను అన్ని రంగాల్లో ముందుకు తీసుకువెళ్లే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. చేనేతను ఆదుకునేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతామన్నారు. ప్రతి సోమవారం అందరూ చేనేత వస్త్రాలు ధరించి ప్రోత్సహించాలని కోరారు. ఐదేళ్లల్లో ఇసుక కోసం ప్రజలు ఇబ్బందులు పడ్డారన్నారు. ఇసుకతోనే రాష్ట్రాన్ని మాజీ సీఎం జగన్, వైసీపీ ఎమ్మెల్యేలు దోచుకున్నారన్నారు. సీఎం చంద్రబాబు ఉచిత ఇసుక పాలసీని తీసుకొచ్చారని, సామాన్య ప్రజలకు నాణ్యమైన ఇసుకను అందించేందుకు రీచ్‌లు ఏర్పాటు చేశామన్నారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ... సీఎం చంద్రబాబు అడుగు జాడల్లో నడుస్తూ అన్ని వర్గాల సంక్షేమం కోసం పనిచేస్తామన్నారు. ఎన్నికల హామీల అమలులో భాగంగా సీఎం చంద్రబాబు తొలి సంతకం మెగా డీఎస్సీపై పెట్టి, యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేలా చొరవ చూపారన్నారు. గత ప్రభుత్వం హయాంలో అస్తవ్యస్తంగా మారిన పాలనను గాడిలో పెట్టేందుకు చంద్రబాబు శ్రమిస్తున్నారన్నారు. జిల్లాలో బీసీ, ఎస్సీఎస్టీ, మైనార్టీ స్కూళ్లలో సీట్ల కొరత ఎక్కువ ఉందని, సీట్లు పెంచి ఎక్కువ మంది విద్యార్థులకు అవకాశం కల్పించేలా చూడాలని మంత్రి సవితను కోరారు. జిల్లాలో హార్టికల్చర్ ఎయిర్ పోర్టు ఏర్పాటు చేస్తే పండిన పంటలను న్యూఢిల్లీ, కోల్‌కతా వంటి నగరాలకు, ఇతర దేశాలకు పంపేందుకు అవకాశం ఉంటుందన్నారు. అనంత నగరంలో అండర్ డ్రైనేజీ కోసం నిధులు విడుదల చేయాలని కేంద్ర మంత్రిని కోరినట్లు వెల్లడించారు. అనంతను స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దుతామన్నారు. పార్లమెంట్ సమావేశాల్లో జిల్లా సమస్యలను ప్రస్తావించి నిధులు రాబట్టేందుకు కృషి చేస్తానన్నారు.

స్పెషల్ కౌంటర్లలో సోనామసూరి, కందిపప్పు అమ్మకాలు

జాయింట్ కలెక్టరు కేతన్‌గార్గ్

అనంతపురం టౌన్, జూలై 10: స్థానిక రైతుబజార్‌లోని ప్రత్యేక కౌంటర్లలో సోనామసూరి, కందిపప్పు అమ్మకాలు చేపట్టినట్లు జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. కందిపప్పు కిలోరూ160లు, బీపీటీ సోనామసూరి ఫైన్‌రైస్(స్టీమ్) కిలో49, బీపీటీ సోనామసూరి ఫైన్‌రైస్(ముడి) కిలో రూ48 చొప్పన ధరలను నిర్ణయించడం జరిగిందన్నారు. అదేవిధంగా జిల్లాకేంద్రంలోని డీమార్ట్, రిలయన్స్‌మార్ట్, విశాల్‌మెగా మార్ట్, మోర్‌మార్ట్‌లలో కూడా నిర్ణయించిన ధరలకే కందిపప్పు, బియ్యం అమ్మకాలు చేయడం జరుగుతుందన్నారు.

టమోటా కిలో రూ.45

అనంతపురం రూరల్, జూలై 10: కక్కలపల్లి మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.45తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. బుధవారం 90టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.38, కనిష్ఠ ధర రూ.32 పలికినట్లు ఆయన తెలిపారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేయాల్సిందే

- స్కీం వర్కర్లపై వేధింపులు ఆపాలి
- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు



ధర్నాలో మాట్లాడుతున్న ఓబులు

అనంతపురం కల్చరల్, జూలై 10: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు డిమాండ్ చేశారు. సీఐటీయూ దేశవ్యాప్త పిలుపులో భాగంగా బుధవారం కార్మికుల డిమాండ్స్‌డేగా పాటిస్తూ సప్తగిరి సర్కిల్ నుంచి కలెక్టరేట్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు నాగమణి, ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ సంయుక్త అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో ఓబులు మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం కార్మికులు, కర్షకుల శ్రమను కార్పొరేట్ సంస్థలకు దోచిపెట్టేలా లేబర్‌కోడ్‌లను తీసుకొచ్చిందన్నారు. ఎంతోమంది కార్మికులు ప్రాణత్యాగాలు చేసి సాధించుకున్న చట్టాలను నిర్వీర్యం చేసి, నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందని, ఇది కార్మికులకు తీవ్ర నష్టం కలిగిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే లేబర్‌కోడ్‌లను ఉపసంహరించి, 44 చట్టాలను పునరుద్ధరించాలన్నారు. రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక కొందరు స్థానిక నాయకులు చిరుద్యోగులు, స్కీం వర్కర్లపై దాడులు, వేధింపులు, తొలగింపులకు పాల్పడడం తగదన్నారు. అనంతరం కలెక్టరేట్ ఏఓను కలిసి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి గోపాల్, నగర కార్యదర్శులు ముర్తుజా, వెంకటనారాయణ, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శకుంతల, రమాదేవి, మున్సిపల్ ఉద్యోగులు కార్మికుల యూనియన్, గ్రామపంచాయతీ ఉద్యోగులు కార్మికుల యూనియన్, మెడికల్ రెప్స్ యూనియన్, శ్రీరామిరెడ్డి, సత్యసాయి వాటర్ వర్క్స్ యూనియన్ల నాయకులు పాల్గొన్నారు.

భార్యను హతమార్చిన భర్త



మృత్యురాలు సువర్ణ

గార్లదిన్నె, జూలై 10: మండలంలోని ఇల్లూరులో కుటుంబ కలహాలతో భార్యను భర్త బుధవారం హత్య చేశాడు. పోలీసులు తెలిపిన మేరకు... ప్యాపిలికి చెందిన బోయ ఓబులేసు కుమార్తె సువర్ణ (27)ను పదేళ్ల కిందట ఇల్లూరు గ్రామానికి చెందిన ఎర్రిస్వామికి ఇచ్చి వివాహం చేశారు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఎర్రిస్వామి బొలెరో వాహనం నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఎర్రిస్వామి మరో మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడనే అనుమానంతో భార్య సువర్ణ కొన్ని రోజుల నుంచి భర్తతో గొడవ పడుతోంది. ఈక్రమంలోనే మంగళవారం రాత్రి కూడా గొడవపడ్డారు. గొడవలో కోపోద్రిక్తుడైన ఎర్రిస్వామి భార్య సువర్ణను చితకబాది చంపేశాడు. అనంతరం ఇంట్లోనే ఉరివేసి ఆత్మహత్యగా చిత్రకరించాడు. సమాచారం అందుకున్న సీఐ శ్రీధర్, ఎస్ఐ గౌస్‌బాషా బుధవారం ఉదయం సంఘటన స్థలానికి చేరుకుని జరిగిన విషయంపై ఆరా తీశారు. మృతురాలి పుట్టింటి వారు ఇల్లూరుకు చేరుకుని తమ కుమార్తెను ఎర్రిస్వామే హత్య చేశాడని తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు భర్త ఎర్రిస్వామిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గౌస్‌బాషా తెలిపారు. విచారణలో తానే తన భార్యను హత్య చేసినట్లు నిందితుడు ఎర్రిస్వామి ఒప్పుకున్నట్లు పోలీసులు తెలిపారు.

గంజాయి విక్రేతల అరెస్ట్



స్వాధీనం చేసుకున్న గంజాయిని చూపుతున్న పోలీసులు

హిందూపురం(సోమందేపల్లి), జూలై 10 : గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి సుమారు రూ.30వేలు విలువచేసే 2కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ బాజీజాన్‌సైద వివరాలను వెల్లడించారు. మండల కేంద్రంలోని నక్కలగుట్ట కాలనీవద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరిని గుర్తించి స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకుని వారిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల విచారణలో వారు గంజాయి అమ్మకానికి వచ్చినట్లు తెలిసింది. ఒడిశా రాష్ట్రం బాలంగీర్ జిల్లాకు చెందిన బలరాంబాగ్, పింటునాయక్ పుల్వామాకు చెందిన రాహుల్ నుంచి గంజాయిని తక్కువ ధరకు కొనుగోలుచేసి వాటిని చిన్నప్యాకెట్లుగా మార్చి అమ్ముతున్నారు. ఈ నేపథ్యంలో స్థానికులు అందించిన సమాచారం మేరకు వారిని అరెస్టు చేసి వారి నుంచి రెండు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నాం. వారిని పెనుకొండ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ముందుకు హాజరుపరిచాం. మరికొందరు కూడా గంజాయిని విక్రయిస్తున్నట్లు సమాచారం ఉంది. వారిని త్వరలోనే అరెస్టు చేస్తాం. సమావేశంలో సీఐ యుగంధర్, ఎస్ఐ విజయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబును కలిసిన గడ్డం సుబ్రహ్మణ్యం



సీఎం చంద్రబాబునాయుడును కలిసిన గడ్డం సుబ్రహ్మణ్యం, ఆయన కుమారుడు లలిత్‌కృష్ణ

అనంతపురం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గడ్డం సుబ్రహ్మణ్యం, ఆయన కుమారుడు ఎద్దులపల్లి లలిత్‌కృష్ణ కలిశారు. బుధవారం మంగళగిరిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో వారు చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. కూటమి అధికారంలోకి రావడంతోపాటు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో వారు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఇదే సందర్భంలో త్వరలో భర్తీ చేయనున్న నామినేటెడ్ పోస్టుల్లో తగిన గుర్తింపునివ్వాలని చంద్రబాబును కోరారు. ఇదిలా ఉండగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో లలిత్‌కృష్ణ తాజా రాజకీయాలపై చర్చించినట్లు సమాచారం.

నారా లోకేశ్‌ను కలిసిన ఎంపీ బీకే పార్థసారథి



పెనుకొండ, జూలై 10: తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఐటీశాఖ మంత్రి నారాలోకేష్‌ను హిందూపురం పార్లమెంట్ సభ్యుడు బుధవారం బీకే పార్థసారథి భేటీ అయ్యారు. ఆయనతో పాటు రొద్దం మండల టీడీపీ నాయకులు నరసింహులు ఉన్నారు.

రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

హిందూపురం, జూలై 10 : హిందూపురం మండలం దేవరపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి రైలు కిందపడి మృతి చెందినట్లు రైల్వే ఎస్ఐ బాలాజీ నాయక్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు బుధవారం మధ్యాహ్నం సమయంలో సుమారు 35నుంచి 40ఏళ్ల వయసు గల వ్యక్తి దేవరపల్లి సమీపంలో రైలుకిందపడి మృతిచెందాడు. మృతుడు 5.5అడుగుల ఎత్తు ఉన్నాడు. అతని వద్ద కర్ణాటక ఆర్టీసీబస్సులో ప్రయాణం చేసిన బస్సుటికెట్ ఉందన్నారు. ఆ టికెట్ మంగళవారం ప్రయాణించిందన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎవరైనా గుర్తిస్తే హిందూపురం రైల్వే పోలీసులు 9441238182 నందు సంప్రదించాలన్నారు.

మహాప్రభో..! జీతాలు ఇవ్వండి

శాప్ కార్యాలయం ఎదుట కోచ్‌ల ధర్నా



ధర్నా చేస్తున్న కోచ్‌లు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 10: 'గత ఆరునెలలుగా వేతనాలు లేవు. మా కుటుంబాలు ఏమితినాలి? ఎలా బతకాలి'? అంటూ జిల్లా క్రీడాప్రాధికార సంస్థ కోచ్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విజయవాడలోని శాప్ కార్యాలయం ఎదుట క్రీడాకోచ్‌లు బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా శాప్ కోచ్‌ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాఘవేంద్ర మాట్లాడుతూ 2017లో శాప్‌లో కోచ్‌లుగా చేరామని, అయితే ఇప్పటి వరకు తమకు జీతాలు పెంచలేదన్నారు. గత ఆరు నెలలుగా జీతాలే ఇవ్వకుండా వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో తమ కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. వెంటనే తమకు ఉద్యోగభద్రత కల్పించి, కనీస వేతనం చెల్లించాలన్నారు. కార్యక్రమంలో కోచ్‌లు అనీల్‌కుమార్, ధనుంజయ రెడ్డి, జెబీవుల్లా, మంజుళ, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

కోచింగ్‌లు నిరంతరాయంగా కొనసాగించాలి

● కలెక్టర్ వినోద్‌కుమార్


స్టడీ సర్కిల్‌లో ఉచిత శిక్షణపై ఆరా తీస్తున్న కలెక్టర్

అనంతపురం ప్రెస్‌క్లబ్, జూలై 10: బీసీ స్టడీ సర్కిల్‌లో ప్రతి ఒక్క కోచింగ్‌ను నిరంతరాయంగా కొనసాగించాలని కలెక్టర్ వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం రాత్రి కలెక్టర్ బీసీ స్టడీ సర్కిల్‌ను తనిఖీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇకనుంచి స్టడీ సర్కిల్‌లో ఏదో ఒక కోచింగ్ నిర్వహించాలని, ఆన్‌లైన్‌లో ఉచితంగా శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. స్టడీ సర్కిల్‌లోని ప్రతి గదిని క్షుణ్ణంగా పరిశీలించారు. గ్రూప్-1,2కు సంబంధించిన శిక్షణ ఎలా జరుగుతున్నాయని ఆరా తీశారు. ఉచిత డీఎస్సీ కోచింగ్ విషయంలో జాగ్రత్తలు వహించి ప్రతి ఒక్క విద్యార్థికి నాణ్యమైన శిక్షణను ఇవ్వాలన్నారు. కలెక్టర్ వెంట కో-ఆర్డినేటర్ రవీంద్ర, అకౌంటెంట్ సుబ్బయ్య, లైబ్రేరియన్ శ్రీనివాసులు, జూనియర్ అసిస్టెంట్ జయప్రకాష్‌నాయుడు ఉన్నారు.

పూజారులకు గౌరవ వేతనం ఇవ్వాలి


మంత్రి సవితకు సమస్యలు వివరిస్తున్న పూజారులు

రాప్తాడు, జూలై 10: జిల్లా వ్యాప్తంగా బీరప్ప స్వామి దేవాలయాల్లోని పూజారులకు గౌరవ వేతనం ఇవ్వాలని పూజారులు బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితను కోరారు. అనంతపురం నగరంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో మంత్రిని టీడీపీ మండల కన్వీనర్ పంపు కొండప్ప, బీరప్పస్వామి దేవాలయ పూజారులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందచేశారు. పూజారులు మాట్లాడుతూ ఆలయాల్లో పూజలు చేసుకుని జీవిస్తున్న తమకు ప్రభుత్వం నుంచి గౌరవ వేతనం అందిస్తే ఆసరాగా ఉంటుందన్నారు. మంత్రి సానుకూలంగా స్పందించినట్లు పూజారులు తెలిపారు.

ఓసీ నిరుద్యోగులను ఆదుకోండి

అనంతపురం ప్రెస్‌క్లబ్, జూలై 10: బీసీ స్టడీ సర్కిళ్లలో ఇస్తున్న డీఎస్సీ ఉచిత శిక్షణలో ఓసీ నిరుద్యోగులకు అవకాశం కల్పించి ఆదుకోవాలని ఓసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి బుర్రా జయవర్ధన్‌రెడ్డి మంత్రి సవితమ్మను కోరారు. బుధవారం ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో మంత్రిని కలిసి సమస్యల వినతి పత్రాన్ని అందజేశారు. నాయకులు మాధవరెడ్డి, నాయుడు, ఆనంద్‌రెడ్డి, సంతోష్ పాల్గొన్నారు.

మత్స్యకారుల సమస్యలు పరిష్కరించండి


మంత్రి అచ్చెన్నాయుడుకు వినతి పత్రం ఇస్తున్న మత్స్యకారులు

అనంతపురం అర్బన్, జూలై 10: మత్స్యకారుల సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడుకు జాతీయ మత్స్యకారుల సంఘం నాయకులు కోరారు. బుధవారం విజయవాడలోని ఆయన నివాసంలో జాతీయ మత్స్యకారుల సంఘం రాష్ట్ర కో ఆర్డినేటర్ బెస్త కుళ్లాయప్ప, నాయకులు రామాంజనేయులు, యల్లప్ప, కృష్ణ మంత్రిని కలిసి పలు సమస్యలపై వినతి పత్రం అందజేశారు.

వసతి గృహాల అభివృద్ధికి నిధులు విడుదల చేయండి


మంత్రికి మొక్క అందజేస్తున్న ఎమ్మెల్యే

శింగనమల జూలై 10: నియోజకవర్గంలో బీసీ వసతి గృహాల మరమ్మతులు, నూతన భవన నిర్మాణాలకు నిధులు విడుదల చేయాలని మంత్రి సవితకు ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ విన్నవించారు. బుధవారం మంత్రి ఎమ్మెల్యే స్వగృహం అనంతపురంలో తేనేటి విందుకు హాజయ్యారు. ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు మంత్రికి స్వాగతం పలికారు. నియోజకవర్గంలోని బీసీ వసతి గృహాల్లో సమస్యలను, భవనాల పరిస్థితులపై మంత్రికి వివరించారు.

ఉమ్మడి జిల్లాల అభివృద్ధికి సహకరించండి


మంత్రికి మెమెంటోను అందజేస్తున్న ఎమ్మెల్యే సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె

అనంతపురం రూరల్, జూలై 10: రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన ఉమ్మడి జిల్లాల అభివృద్ధికాభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపాలని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి మంత్రి సవితమ్మను కోరారు. బుధవారం నగర శివారుల్లోని పీవీకేకే ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి నివాసానికి విచ్చేసిన మంత్రికి ఎమ్మెల్యేతోపాటు కుటుంబ సభ్యులు ఘనస్వాగతం పలికారు. పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. శాలువా, పుష్పగుచ్ఛాలతో సత్కరించారు. మాజీ మంత్రిపల్లె రఘునాథరెడ్డి, బాలాజీ విద్యాసంస్థల ఛైర్మన్ పల్లె కిశోర్‌రెడ్డి పాల్గొన్నారు.

వ్యవసాయ కనెక్షన్లు మంజూరు చేయండి


ఎస్‌ఈకి వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

అనంతపురం రూరల్, జూలై 10: ఉమ్మడిజిల్లా మడకశిర నియోజకవర్గం పరిధిలోని రైతులకు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేయాలని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు కోరారు. బుధవారం జేఎన్‌టీయూ రోడ్డులోని విద్యుత్ శాఖ ప్రధాన కార్యాలయంలో ఎస్‌ఈ సురేంద్రతో మాట్లాడారు. ఆయనకు వినతి పత్రం ఇచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజవర్గంలో 412 వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లు, వెయ్యి సర్వీసులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. వ్యవసాయ కనెక్షన్లు సకాలంలో మంజూరు కాకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే వాటిని విడుదల చేయాలన్నారు. ఆమేరకు చర్యలు తీసుకుంటామని ఎస్‌ఈ ఎమ్మెల్యేకు వివరించారు.

రోడ్డుభద్రతా నియమాలతో ప్రమాదాలు దూరం

● న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి శివప్రసాద్


మాట్లాడుతున్న శివప్రసాద్ యాదవ్

అనంతపురం కల్చరల్, జూలై 10: రోడ్డుభద్రతా నియమాలు పాటించడం వల్ల ప్రమాదాలను దూరం చేయవచ్చని న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి శివప్రసాద్ యాదవ్ అన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు బుధవారం అనంతపురం ఆర్టీసీ డిపో ఆవరణలో న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. డ్రైవర్లు బస్సు నడిపేటపుడు అప్రమత్తత వ్యవహరించాలని, బస్సులోని ప్రయాణికులను సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేర్చడమే ధ్యేయంగా పనిచేయాలన్నారు. ట్రాఫిక్ సిగ్నల్స్‌ను తూచా తప్పకుండా పాటించాలన్నారు. ట్రాఫిక్ సీఐ నారాయణరెడ్డి, డీఎం నాగభూపాల్, వినయ్, అరుణ్ చైతన్య పాల్గొన్నారు.

ఇక్కడ కూర్చోవాలంటే సిగ్గుగా ఉంది

● నగరపాలిక అవినీతిపై కలెక్టర్‌తో విచారణ చేయిస్తా
● కౌన్సిల్‌లో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్
● సమస్యలపై సభ్యుల గళం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి, చిత్రంలో ఎంపీ అంబికా

అనంతపురం క్రైం,జూలై 10: ఇక్కడ కూర్చోవాలంటే సిగ్గుగా అనిపిస్తోంది... అన్నింటా అవినీతే జరిగిందా అని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. బుధవారం నగరపాలిక కార్యాలయంలోని సమావేశపు హాల్‌లో కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. మేయర్ మహమ్మద్ వసీం అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఎక్స్ అఫిషియో సభ్యులుగా ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ హాజరయ్యారు. కమిషనర్ మేఘస్వరూప్, డిప్యూటీ మేయర్లు, కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు. తొలుత బడ్జెట్ అంశంపై చదివి వినిపిస్తుండగానే సభ్యులు సమస్యలపై గళం విప్పారు. కార్పొరేటర్ శ్రీనివాసులు స్థానికంగా డ్రైనేజీ సమస్యలను కమిషనర్‌కు చెప్పినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మూడో డివిజన్ కార్పొరేటర్ అంకె కుమారమ్మ మాట్లాడుతూ వేణుగోపాల్‌నగర్‌లో 80 అడుగుల రోడ్డుకు సంబంధించి ఓ స్థలానికి ఇంకా పరిహారం ఇవ్వలేదని దీంతో రామచంద్ర అనే వ్యక్తి బ్లాక్ చేయించారన్నారు. కానీ కొందరు యజమాని రామచంద్ర అనే వ్యక్తిని ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఇందుకు కమిషనర్ స్పందిస్తూ...ఆ విషయం తమ దృష్టిలో ఉందన్నారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ నగరంలో ఎన్ని ఆక్రమణలున్నాయి. ఎన్నింటికి నోటీసులిచ్చారు, ఎన్నింటిపై చార్జిషీట్ దాఖలు చేశారనే వివరాలివ్వాలని కమిషనర్‌ను కోరారు. కార్పొరేటర్ సైఫుల్లా మాట్లాడుతూ... డంపింగ్‌యార్డ్‌లో అవినీతి జరిగిందని చెబుతున్నారని, ఈ విషయంలో కార్పొరేటర్లుగా తాము తల దించుకునే పరిస్థితి ఉందని దీనిపై చర్చ జరగాలన్నారు. డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ తక్కువ సమయంలో ఎక్కువ చెత్తను బయోమైనింగ్ ఎలా చేస్తారని ప్రశ్నించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎంబుక్‌లో చెత్త ఎన్ని టన్నులుగా రికార్డ్ చేశారని ప్రశ్నించారు. సంబంధిత కాంట్రాక్టు సంస్థను బ్లాక్ చేయించాలని, చెల్లించిన డబ్బును వెనక్కు తీసుకోవాలని ఆదేశించారు.

అవినీతి కాదు నిజాయతీ....

డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య మాట్లాడుతూ... నగరంలో పనిముట్ల విషయంలో రూ.1.60కోట్ల విషయంలో అక్రమాలు జరిగాయన్నారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ ఇక్కడ కూర్చోవాలంటే సిగ్గుగా అనిపిస్తోందని, డంపింగ్‌యార్డ్, బ్లీచింగ్ పౌడర్, పనిముట్లు ఇలా అన్నింటా అవినీతే జరిగిందన్నారు. వీటిని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి విచారణ చేయిస్తామన్నారు. మేయర్ ప్రతిస్పందిస్తూ...అవినీతి కాదని నిజాయతీతో మూడేళ్ల పనిచేశామని, అవినీతి జరిగిందనే అనుమానముంటే విచారణ చేయించాలన్నారు. ఇదే సమయంలో కౌన్సిల్ హాల్‌లో కలకలం మొదలైంది. శ్రీనివాసులు తదితర కార్పొరేటర్లు కొందరు అభివృద్ధి చేశామని చెప్పలేరా..? ఎప్పుడూ అవినీతేనా అంటూ గొంతెత్తారు. సోలార్ వ్యవస్థను నగరంలో ప్రవేశపెట్టే విషయంపై చర్చించారు. ఎక్కడెక్కడ పెట్టాలనే విషయంపై మాట్లాడారు. కార్పొరేటర్ బాలాంజనేయులు మాట్లాడుతూ... కొంతమంది ఉద్యోగులు అదే సీట్లలో కూర్చుంటున్నారని, పని చేతకాదని దాటవేసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఇందుకు ఎంపీ, ఎమ్మెల్యే జోక్యం చేసుకుని ప్రభుత్వం మారితే ఒకటి... మారకపోతే మరొకటా... ఇన్నాళ్లు ఏం చేశారని ప్రశ్నించారు. రాజకీయాలు వదిలేసి అభివృద్ధే మా ధ్యేయమని ముందే చెప్పామని, ఆ మాటకే కట్టుబడి ఉంటామన్నారు.

ఆ స్థలం వైద్య కళాశాలదే..!

● కంచె వేసుకోవాలని అధికారుల సూచన
● కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యే వైద్యుల కృతజ్ఞతలు


ఎమ్మెల్యేకి శుభాకాంక్షలు తెలుపుతున్న వైద్యులు

అనంతపురం టౌన్, జూలై 10: సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి ముందు భాగంలో ఉన్న ఆరు ఎకరాల స్థలం మెడికల్ కళాశాల ఆటస్థలందేనని అధికారులు తేల్చారు. ఆ స్థలం చుట్టూ కంచె వేసుకొని ఆట స్థలానికి వినియోగించుకోవాలని ఉత్తర్వులు ఇచ్చారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆ స్థలంపై కొందరు కన్నేశారు. ఓ సర్పంచ్ మెడికల్ కళాశాల స్థలంలో వాటర్ ట్యాంకు ఏర్పాటు చేశారు. ఆ సమయంలో స్థలం వైద్యకళాశాలదని చెప్పినా వినలేదు. అప్పట్లోనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోయినా స్పందించలేదు. ప్రస్తుత కలెక్టర్ వినోద్ కుమార్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ దృష్టికి వైద్యాధికారులు తీసికెళ్లారు. సీరియస్‌గా తీసుకొని రికార్డులు పరిశీలించి ఆ స్థల సమస్య తీర్చాలని జేసీ, డీఆర్‌ఓ, ఆర్డీఓలకు కలెక్టర్ ఆదేశించారు. వారు స్థలం రికార్డులు పరిశీలించి స్థలం ఆరు ఎకరాలకు పైగా ఉందని, అది వైద్యకళాశాలకు ఎన్‌ఎంసీ నిబంధనల మేరకు అప్పట్లోనే ప్రభుత్వం కేటాయించిందని తేల్చారు. దీంతో స్థలంలోకి ఎవరూ రాకుండా వెంటనే కంచె వేయించి, వైద్య కళాశాలకు ఆటస్థలంగా వినియోగించుకోవాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. దీనిపై బుధవారం ఎంపీ, ఎమ్మెల్యేలను వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యాలరావు, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, సూపర్‌స్పెషాలిటీ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, పలువురు వైద్యులు మర్యాదపూర్వకంగా కలిసి స్థల సమస్య తీర్చినందుకు ధన్యవాదాలు తెలిపారు.

ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల కనీస పెన్షన్ పెంచాలి


ఎంపీకి సమస్యలు విన్నవిస్తున్న ఆర్టీసీ పెన్షన్‌దారులు

అనంతపురం కల్చరల్, జూలై 10: ఏపీఎస్ ఆర్టీసీలో పనిచేసి ఉద్యోగ విరణ పొందినవారికి కనీస పెన్షన్‌ను పెంచాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి నాగయ్య డిమాండ్ చేశారు. బుధవారం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణను కలిసి వినతిపత్రం అందించేశారు. నాగయ్య మాట్లాడుతూ... ఆర్టీసీలో రిటైర్ యినవారికి ఈపీఎస్-95 కింద రూ.వెయ్యి నుంచి రూ.3వేల వరకు మాత్రమే పెన్షన్ వస్తోందని, ఈ పెన్షన్ తమకు కనీసం వైద్య ఖర్చులకూ సరిపోవడం లేదన్నారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైసి రెడ్డి, జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షుడు వలీఖాన్, కోశాధికారి నారాయణరెడ్డి, సహాయ కార్యదర్శి రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఎస్వీ డిగ్రీ కళాశాలలో క్యాంపస్ డ్రైవ్

అనంతపురం ప్రెస్‌క్లబ్, జూలై 10: నగరంలోని ఎస్వీ డిగ్రీ, పీజీ కళాశాలలో పీపుల్ టెక్ గ్రూప్ కంపెనీకి చెందిన పూల్ క్యాంపస్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు కళాశాల వైస్ ఛైర్మన్ చక్రధర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన స్పష్టం చేశారు. 2023, 2024 సంవత్సరాల్లో బీబీఏ, బీసీఏ, బీఎస్సీ, బీకామ్, బీటెక్ బ్యాచిలర్ డిగ్రీ ఏదైనా ఉత్తీర్ణులైన విదార్థులు పూర్తి బయోడేటాతో జీసెస్‌నగర్‌లో ఉన్న ఎస్వీ డిగ్రీ కళాశాలకు ఉదయం 8.30 గంటలకు నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరుకావాలన్నారు. మొదటి రౌండులో గ్రూప్ డిస్కషన్, రెండో రౌండ్ వ్యక్తిగత ఇంటర్వ్యూల ఆధారంగా ఎంపిక ప్రక్రియ ఉంటుందన్నారు. ఎన్నికైన విద్యార్థులు కర్నూలులోని ఆదోనిలో ఉద్యోగం చేయాల్సి ఉంటుందన్నారు.

పూర్వవిద్యార్థుల వార్షికోత్సవానికి సన్నాహాలు

అనంతపురం సెంట్రల్, జూలై 10: జేఎన్‌టీయూ పూర్వ విద్యార్థుల వార్షికోత్సవ వేడుకల సన్నాహానికి ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు పూర్వ విద్యార్థుల మేనేజ్‌మెంట్ కమిటీ ప్రెసిడెంట్, కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ తెలిపారు. బుధవారం కళాశాలలో సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతియేటా పూర్వ విద్యార్థుల వార్షికోత్సవాన్ని ఏర్పాటుచేసి కళాశాలలో చదవుతున్న విద్యార్థుల కెరీర్ డెవలప్‌మెంట్, భవిష్యత్ అవకాశాలు తదితర అంశాలపై సెమినార్ నిర్వహిస్తున్నామన్నారు. 20వ తేదీన సమావేశాన్ని నిర్వహించేందుకు కమిటీ నిశ్చయిందని తెలిపారు. సభ్యులు శంకర్, రఘునాథరెడ్డి, శోభాబిందు, సుజాత, అజిత, అరుణకాంతి, కిరణ్మయి, మాధవి, రామశేఖరరెడ్డి, రామకృష్ణారెడ్డి, కళ్యాణిరాధ, సుమలత పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంతో మత్స్యసంపదను పెంచుకోవాలి

అనంతపురం ప్రెస్‌క్లబ్, జూలై 10: మత్స్యకారులు సాంకేతిక పరిజ్ఞానంతో మత్స్యసంపదను పెంపొందించుకోవాలని ఆ శాఖ డీడీ శ్రీనివాస్‌నాయక్ సూచించారు. బుధవారం ఆ శాఖ జిల్లా కార్యాలయంలో జాతీయ మత్స్యకారుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. డీడీ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జూలై 10న భారతీయ ప్రధాన చేపల పెంపకంతో ప్రేరిత సంతానోత్పత్తి సాంకేతిక పరిజ్ఞానాన్ని 1957లో శాస్త్రవేత్తలు డా. హీరాలాల్ చౌదరి, డా. అలికున్ని కొనసాగించారన్నారు. వారి గుర్తుగా ప్రతి ఏడాది జాతీయ మత్స్యకారుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రేరిత సంతోనోత్పత్తి ద్వారా మత్స్యకారులకు సీజన్‌లో చేపపిల్లలు పంపిణీ చేస్తారన్నారు. ఎఫ్‌డీఓలు పక్కీరయ్య, ఆసిఫ్, లక్ష్మీనారాయణ, మత్స్యకార సహకార సంఘం అధ్యక్షుడు నగేష్, మాజీ అధ్యక్షుడు పోతన్న పాల్గొన్నారు.

పోస్టల్ ఇన్సూరెన్స్‌పై అవగాహన అవసరం

శింగనమల జూలై 10: తపాల శాఖలో ఖాతాదారులకు ఇన్సురెన్స్‌పై అవగాహన ఉండాలని తపాల శాఖ సూపరింటెండెంట్ గురుస్వామి అన్నారు. బుధవారం మండలంలోని తరిమెల తపాల కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. సబ్‌డివిజన్ అధికారి విజయ్ కూమార్, పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు గాలికి వదిలేశారా..?

● అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

బుక్కరాయసముద్రం, జూలై 10: బాధ్యతాయుతంగా పనిచేయాల్సిన అధికారులు ప్రజా సమస్యలను గత ఐదేళ్లు వదిలేశారా అని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఆగ్రహం వ్యక్తం చేసింది. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై పలు సమస్యలపై అధికారులతో చర్చించారు. బుక్కరాయసముద్రం గ్రామ పంచాయతీలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ, ఈఓఆర్డీ, సెక్రటరీలు నిద్రపోతున్నారా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాగునీటి కోసం ఎంత నిధులు వచ్చాయని, ఎక్కడ ఖర్చుపెట్టారన్న వివరాలు తన ముందుకు రావాలన్నారు. ఎంపీపీ సునీత, జడ్పీటీసీ భాస్కర్, తహసీల్దార్ హనుమంతునాయక్, ఎంపీడీఓ శోభారాణి, ఏఓ శ్యాంసుందర్‌రెడ్డి పాల్గొన్నారు.

నీటి సమస్యను పరిష్కరించండి: బీకేఎస్ పంచాయతీలోని చేపలకాలనీ, గౌరయ్య కొట్టాలు, ఎస్సీ కాలనీ, గాంధీనగర్, సుందర్ నగర్ తదితర కాలనీలలో నీటి సమస్య తీవ్రంగా ఉందని ఆయా కాలనీల మహిళలు ఎమ్మెల్యేని కలిసి విన్నవించారు. మూడు నెలలుగా సమస్య తీవ్రంగా ఉందని, అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. వాటర్ మెన్ ఉద్దేశ్య పూర్వకంగా నీరు విడుదల చేయడం లేదని పిర్యాదు చేశారు. వెంటనే ఈఓఆర్డీ, సెక్రటరీని పిలిపించి తాగునీటి సమస్య పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి


రాప్తాడు తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న అంగన్‌వాడీలు

శింగనమల జూలై 10: అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గురించాలని అంగన్‌వాడీ వర్కర్స్ మండల అధ్యక్షులు బొయ రమణమ్మ డిమాండ్ చేశారు. బుధవారం అంగన్‌వాడీ కోర్కెల దినం సందర్భంగా తన సమస్యలపై తహసీల్దార్ శోభన్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. రమణమ్మ, భారతి, రత్నమ్మ, నాగేశ్వరి, ప్రమీలా, కాంతమ్మ మాట్లాడుతూ ఐసీడీఎస్ బలోపేతానికి బడ్జెట్ పెంచాలని సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ అమలు చేయాలని డిమాండ్ చేశారు.

రాప్తాడు: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం నాయకులు కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సీతారామన్‌కు వినతి పత్రం అందచేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రామాంజినేయులు, మండల కార్యదర్శి అరుణ, విజయలక్ష్మీ, ముత్యాలమ్మ, ఓబులమ్మ, మమత, సిరిదేవి, సుశీలమ్మ, భారతి పాల్గొన్నారు.

రామగిరి: కేంద్రం, రాష్ట్రంలో ఏర్పడిన కొత్తప్రభుత్వాలు అంగన్‌వాడీ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం తహసీల్దార్ రమణికి అంగన్‌వాడీలు వినతిపత్రం అందజేశారు. ఐసీడీఎస్‌ను బలోపేతంచేయాలని, అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి, సుప్రీంకోర్టు తీర్పుప్రకారం గ్రాట్యుటీ అమలు చేయాలని కోరారు.

చెన్నేకొత్తపల్లి: కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే తమ సమస్యలను పరిష్కరించాలని అంగన్‌వాడీలు కోరారు. కార్మికుల కోర్కెల దినోత్సవాన్ని పురస్కరించుకుని సీఐటీయూ మండల నాయకులు లింగన్నఆధ్వర్యంలో అంగన్‌వాడీలు బుధవారం తహసీల్దార్ హమీద్‌బాషాను కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యకర్తలు రమణమ్మ, కోమల, జయమ్మ, కమలమ్మ పాల్గొన్నారు.

నార్పల: అంగన్‌వాడీ సమస్యలను పరిష్కరించాలని నార్పల ప్రాజెక్ట్ నాయకురాలు డోక్కా శ్రీదేవి, రామాంజినమ్మ కోరారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం తహసీల్దారుకు వినతి పత్రం అందజేశారు. అంగన్‌వాడీ సెక్టార్ నాయకురాళ్లు రేణుక, కళావతి, సుజాత, వెంకటలక్ష్మీ పాల్గొన్నారు.


నార్పలలో కరపత్రాలు విడుదల చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

జగన్నాథ రథయాత్రను జయప్రదం చేయండి


రథయాత్ర బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న ఛైర్మన్ దామోదర్ గౌరంగదాస్, సభ్యులు

అనంతపురం కల్చరల్, జూలై 10: ఇస్కాన్ ఆధ్వర్యంలో 13, 14 తేదీల్లో జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న జగన్నాథ రథయాత్రను జయప్రదం చేయాలని ఇస్కాన్ మందిరాల ఛైర్మన్ దామోదర్ గౌరంగదాస్ పిలుపునిచ్చారు. బుధవారం కలెక్టరేట్ ఎదురుగా ఇస్కాన్ గోశాలలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో జగన్నాథ రథయాత్ర బ్రోచర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ... 13న మధ్యాహ్నం 2 గంటలకు కేఎస్సార్ జూనియర్ కళాశాల నుంచి రథయాత్ర ప్రారంభమై మున్సిపల్ ఆఫీస్ రోడ్డు, సుభాష్‌రోడ్డు, క్లాక్‌టవర్, రాజురోడ్డు, శ్రీకంఠం సర్కిల్, తిలక్‌రోడ్డు, గాంధీబజార్, పాతూరు, బసవన్నకట్ట, సప్తగిరి సర్కిల్ మీదుగా లలితకళా పరిషత్‌కు చేరుకుంటుందన్నారు. మరుసటిరోజు వరకు రథం లలితకళా పరిషత్‌లోనే ఉంటుందన్నారు. 14వ తేదీన సాయంత్రం 5 గంటలకు ప్రత్యేక భజనలు, 6 గంటలకు తులసీపూజ, 6.30 గంటలకు 1008 జంటలతో పంచామృత కలశాభిషేకం, 7 గంటలకు ఇస్కాన్ జీబీసీ ఛైర్మన్ రేవతి రమణ ప్రభుచే ఆధ్యాత్మిక ప్రవచనాలు, 7.30 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు, 8 గంటలకు ఉత్సవ నిర్వహణ దాతలకు ప్రత్యేక దర్శనం కల్పిస్తామన్నారు. రథయాత్రలో ఉభయ తెలుగు రాష్ట్రాలతోపాటు పూణె, మహారాష్ట్ర, కర్ణాటక, కేరళ, తమిళనాడు రాష్ట్రాల కళాకారులచే కళాప్రదర్శనలు ఉంటాయన్నారు. జిల్లా నలుమూలలనుంచి భక్తులు విరివిగా హాజరై మహోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. శ్రీధర్ శ్రీనివాస్, అమలనిమయ్‌దాస్, రామనాథ్‌దాస్ పాల్గొన్నారు.

మంత్రి సవితకు కలెక్టర్ శుభాకాంక్షలు


మంత్రికి మొక్క అందజేస్తున్న కలెక్టర్

అనంతపురం అర్బన్, జూలై 10: బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితకు కలెక్టర్ వినోద్‌కుమార్ శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో మంత్రిని కలెక్టర్ మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

పాస్టర్లకు ఆర్థిక సాయం


ఆర్థికసాయం అందజేస్తున్న పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు

అనంతపురం రూరల్, జూలై 10: జిల్లా పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పలువురు పాస్టర్లకు ఆర్థిక సాయం చేశారు. బుధవారం మండలంలోని రాచానపల్లి గ్రామ సమీపంలోని యేసుకృపా మందిరంలో జిల్లా పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ 4వ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు నాగరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య ప్రసంగీకులుగా పూణె యెరూషలేమ్ ప్రార్థన మందిరం పాస్టర్ థాబసగువ్వల హాజరయ్యారు. అనంతరం కేక్‌కట్‌చేసి వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. జిల్లాలో 20 మంది పాస్టర్లకు రూ.వెయ్యి చొప్పున అందించారు. అలాగే తాడిపత్రి ఏసుక్రీస్తు ప్రార్థన మందిర నిర్మాణానికి రూ.15వేలు, కళ్యాణదుర్గం పాస్టర్ జేమ్స్ పాల్‌నాయక్ సతీమణి వైద్య చికిత్స నిమిత్తం రూ.8,900 ముఖ్యఅథితుల చేతుల మీదుగా అందించారు. వైస్ ప్రెసిడెంట్ పాస్టర్ మార్కు, కార్యదర్శి జహంగీర్, జాషువా, పాస్టర్ లాబాను సుధాకర్, అసోసియేషన్ గౌరవ సలహాదారు వై.పి. బాబు పాల్గొన్నారు.

పండ్ల మొక్కల పెంపకం.. లాభదాయకం

రాప్తాడు, జూలై 10: ఉపాధి హామీ పథకంలో భాగంగా రైతులు పండ్ల తోటలు పెంచడం ఎంతో లాభదాయకం అని ఏపీఓ ఓబన్న అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఫీల్డ్ అసిస్టెంట్‌లతో సమావేశం నిర్వహించారు. ఏపీఓ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో మామిడి, చీనీ, జామ, నేరేడు తదితర మొక్కలు సాగు చేసుకోవచ్చన్నారు. మొక్కలు పెంచినందుకు గానూ ప్రభుత్వం రైతులకు సకాలంలో బిల్లులు మంజూరు చేస్తుందన్నారు. ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

శస్త్రచికిత్సకు ఆర్థిక చేయూత


బాధితులకు చెక్కు అందజేస్తున్న రమణారెడ్డి

అనంతపురం కల్చరల్, జూలై 10: అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి శస్త్రచికిత్స కోసం ఆర్థిక సాయం అందించి అమ్మ సంస్థ చేయూతగా నిలిచింది. అంబేడ్కర్ నగర్‌లో నివాసముంటున్న దళిత పోతన్న, నాగమణి కూలి పనులు చేసుకునేవారు. వీరికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. పోతన్న దీర్ఘకాలికంగా గుండెలో రంధ్రం వల్ల అనారోగ్యంతో బాధపడుతుండగా ఇటీవల గాల్‌బ్లాడర్‌లో రాయి ఉండడం వల్ల మరింత అనారోగ్యానికి గురవడంతో వైద్యులను సంప్రదించగా ఆపరేషన్ చేయాలని, ఇందుకోసం రూ.2.5లక్షలు ఖర్చవుతుందని సూచించారు. పోతన్న నిస్సహాయ స్థితిలో అమ్మ సంస్థను ఆశ్రయించాడు. సంస్థ అధ్యక్షుడు తరిమెల రమణారెడ్డి బుధవారం ఆ కుటుంబానికి రూ.2లక్షలు చెక్కును అందజేశారు. భవిష్యత్‌లో వీరి పిల్లల విద్యాభ్యాసానికి సహాయ సహకారాలందిస్తామని హామీ ఇచ్చారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

రాప్తాడు, జూలై 10: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సెబ్ ఇన్‌స్పెక్టర్ ఎల్లయ్య సూచించారు. బుధవారం మండలంలోని గొల్లపల్లి వద్దనున్న మాంటిస్సోరి కళాశాలలో విద్యార్థులకు మాదకద్రవ్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ విద్యార్థులు విలువలతో కూడిన విద్య నేర్చుకోవాలన్నారు. కళాశాల ఎండీ కృష్ణభరత్, ప్రిన్సిపాల్ మధు, సెబ్ సబ్ ఇన్‌స్పెక్టర్ సరస్వతి, హెడ్ కానిస్టేబుల్ వెంకటనారాయణ పాల్గొన్నారు.

మొక్కలు నాటి.. కాలుష్యాన్ని తగ్గిస్తాం: సీడీపీఓ


ఐసీడీఎస్ కార్యాలయం వద్ద మొక్క నాటిన సీడీపీఓ

శింగనమల జూలై 10: ప్రతి ఇల్లు, అంగన్‌వాడీ సెంటర్ల వద్ద మొక్కలు విరిగా నాటి కాలుష్యం తగ్గిస్తామని సీడీపీఓ ఉమాశంకరమ్మ అన్నారు. బుధవారం హరిత అనంత ప్లాంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి శాస్త్రవేత్త సుధారాణి హాజరయ్యారు. సీడీపీఓ మాట్లాడుతూ అంగన్‌వాడీ సెంటర్లలో మునగ, నిమ్మ, జామ, నేరేడు వంటి పండ్ల మొక్కలు పెంచాలని, ఇంటి వద్ద మొక్కలు నాటాలని అన్నారు. సూపర్‌వైజర్ ధనలక్ష్మి, ఉమాదేవి, కౌసల్య, జ్యోతి వాణిశ్రీ, హేమాలత, నాగమణి, అన్నపూర్ణ పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతోనే అందరి భవిష్యత్తు


మొక్కలు ప్రదర్శిస్తున్న ఉపాధ్యాయులు

అనంతపురం విద్య, జూలై 10: మొక్కల పెంపకంతోనే అందరి భవిష్యత్తు ఆధారపడి ఉంటుందని నారాయణ స్కూల్ ఏజీఎం రమేష్ పేర్కొన్నారు. బుధవారం ద్వారకానగర్‌లోని నారాయణ స్కూల్‌లో వన మహోత్సవం నిర్వహించారు. ఇందులో భాగంగా మొక్కలు నాటారు. అనంతరం ఏజీఎం మాట్లాడుతూ పచచదనంతోనే పరిశుభ్రత సాధ్యమన్నారు. మొక్కలు పెంచడం వల్ల స్వచ్ఛమైన గాలి వస్తుందన్నారు. ప్రిన్సిపాల్ అస్మాఖాన్, ఏవో రవీంద్ర, అకడమిక్ డీన్ శ్రీనివాసులు, సుజాత, రుమాన్ పాల్గొన్నారు.

మంత్రి లోకేశ్‌ను కలిసిన జేసీ పవన్



తాడిపత్రి, జూలై 10: విజయవాడలో బుధవారం విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను టీడీపీనేత జేసీ పవన్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. నారా లోకేశ్‌కు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రాష్ట్ర రాజకీయాలతోపాటు తాడిపత్రి రాజకీయాలపై లోకేశ్ ఆరాతీసినట్లు తెలుస్తోంది. గత ఐదేళ్లలో తాడిపత్రిలో అభివృద్ధి కుంటుపడిందని టీడీపీ ప్రభుత్వంలో అయినా పరిశ్రమల పూర్వవైభవానికి సహకరించాలని నారా లోకేశ్‌ను కోరినట్లు జేసీ పవన్‌రెడ్డి తెలిపారు.

హెల్మెట్ ధరిస్తే ప్రాణాలకు రక్ష

జూనియర్ సివిల్‌కోర్టు న్యాయాధికారి

కళ్యాణదుర్గంరూరల్, జూలై 10 : ద్విచక్ర వాహనదారులు ప్రయాణం చేసేటప్పుడు హెల్మెట్ ధరిస్తే ప్రాణాలను రక్షించుకోవచ్చని జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి బండే సుభాన్ తెలిపారు. స్థానిక కోర్టు ఆవరణంలో బుధవారం ప్రమాదాల నివారణ చట్టాల గురించి, ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు కరణం తిప్పేస్వామి, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ హరి, చక్రవర్తి, మల్లికార్జున, రామాంజనేయులు, దాదాఖలందర్, దేవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

తాడిపత్రి, జూలై 10: స్థానిక ఆర్టీసీ డిపోలో గురువారం ఉదయం 11గంటల నుంచి 12గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ శంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు తమ విలువైన సలహాలు, సూచనలను ఫోన్ నంబర్ 9959225856కు ఫోన్‌చేసి అందించాలని ఆయన కోరారు.

శాంతియుతంగా మొహరం జరుపుకోండి

డీ హీరేహాళ్, జూలై 10: మండల వ్యాప్తంగా ఉన్న దాదాపు అన్ని గ్రామాల్లో మొహరం వేడుకలను శాంతియుతంగా జరుపుకోవాలని ఎస్ఐ గురుప్రసాద్ రెడ్డి తెలియజేశారు. ఆయన ఈ మేరకు బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. మొహరం వేడుకులను నిర్వహించాలనుకునే గ్రామపెద్దలు ముందస్తుగానే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అనుమతి తప్పనిసరిగా పొందాలని తెలిపారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యార్థినులకు చట్టాలపై అవగాహన

పెద్దపప్పూరు, జూలై 10: మండలంలోని జూటూరు కేజీబీవీ పాఠశాలలో బుధవారం విద్యార్థినులకు ఎంపీడీఓ కవిత చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ... గృహహింస చట్టం, బాల్యవివాహాల నిరోధక చట్టం తదితర వాటిపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థినులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. అంతకుమునుపు పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

కూడేరు, జూలై 10: మండల పరిధిలోని అంతరగంగ గ్రామానికి చెందిన రియాజ్ (25) ఆర్థిక ఇబ్బందులు భరించలేక విషపు మందు తాగి, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. అంతరగంగ గ్రామానికి చెందిన రియాజ్ అనే యువకుడు వెల్డింగ్ షాపు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. వెల్డింగ్ షాపులో నష్టాలు రావడంతో దాదాపు రూ. ఐదులక్షల వరకు అప్పులయ్యాయి. వాటిని ఎలా తీర్చాలో దిక్కుతోచక గత నెల 25 తేదీన విషపు మందు తాగి అనంతపురంలోని చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య వహిదా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్యతోపాటు ఇద్దరు పిల్లలున్నారు.

గడ్డివామి దహనం

పామిడి, జూలై 10: గుర్తుతెలియన వ్యక్తులు నిప్పుపెట్టడంతో మండలంలోని ఎదురూరు గ్రామంలో అర్జున అనే రైతుకు చెందిన గడ్డివామి బుధవారం తెల్లవారుజామున దహనమైంది. మండలంలోని ఎదురూరుకు చెందిన కోవెలదిన్నె అర్జున వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించేవాడు. పశువుల మేత కోసం ఇటీవలే వరిగడ్డి కొనుగోలు చేసి వేరుశనగ పొట్టుతో కలిపి వామి వేశాడు. గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో గడ్డివామి దహనమైందని స్థానికులు, బాధిత రైతు తెలిపారు. గడ్డివామిలో చెలరేగుతున్న మంటలను గమనించిన స్థానికులు రైతు అర్జునకు సమాచారమిచ్చారు. గ్రామస్థులతో కలిసి బాధిత రైతు మంటలను ఆర్పేందుకు ప్రయత్నించినా పూర్తిగా కాలిపోయింది. సుమారు రూ. 70వేలు నష్టం వాటిల్లినట్లు రైతు పేర్కొంటున్నాడు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య

తాడిపత్రి, జూలై 10: పట్టణ సమీపంలోని పుట్లూరు రైల్వేగేటు సమీపంలో బుధవారం రాత్రి నాగయ్య (22) అనే యుకుడు రైలుకిందపడి ఆత్మహత్య చేసుకున్నాడని రైల్వే ఎస్ఐ నాగప్ప తెలిపారు. పట్టణంలోని పాతకోటకు చెందిన అదెన్న, లక్ష్మీదేవి దంపతుల కుమారుడు నాగయ్య వాటర్‌ప్లాంట్‌లో పనిచేస్తుండేవాడు. నాగయ్యకు ఒక కంటిలో పువ్వు ఉండడంతోపాటు మరో కన్ను మెల్లకన్ను కావడంతో పెళ్లిసంబంధాలు ఎన్నిచూసినా కుదరలేదు. దీంతో తరచూ బాధపడుతుండేవాడు. బుధవారం జీవితంపై విరక్తిచెంది రైలుకిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. తండ్రి ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేస్తామని రైల్వే ఎస్ఐ తెలిపారు.

కర్ణాటక మద్యం ధ్వంసం

రాయదుర్గంరూరల్, జూలై 10: స్థానికి సెబ్ సర్కిల్ పరిధిలో 24 కేసుల్లో పట్టుబడ్డ రూ. 5.94 లక్షల కర్ణాటక మద్యాన్ని ధ్వంసం చేసినట్లు అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరిండెంట్ మంగు శ్రీరాం పేర్కొన్నారు. బైపాస్‌రోడ్డులో బుధవారం సెబ్ పరిధిలో 24 కేసుల్లో పట్టుబడ్డ 8400 లీటర్ల టెట్రా ప్యాకెట్లను ధ్వంసం చేశారు. ఈ కార్యక్రమంలో సెబ్ సీఐ మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం దగ్ధం

పెద్దవడుగూరు, జూలై 10: మండలంలోని చింతలచెరువు గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి నిప్పురవ్వలు పడి రాము అనే వ్యక్తికి చెందిన ద్విచక్రవాహనం దగ్ధమైనట్లు పోలీసులు తెలిపారు. రాము తన ద్విచక్ర వాహనాన్ని ఇంటి ఎదుట నిలిపి ఉంచాడు. పైన ఉన్న విద్యుత్‌తీగల్లో రాపిడి జరిగి నిప్పులు చెలరేగాయి. ఈ నిప్పులు ద్విచక్రవాహనంపై పడడంతో మంటలు చెలరేగి అగ్నికి ఆహుతైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ రెడ్డప్ప తెలిపారు.

ఎన్నికల్లో కష్టపడిన అందరికీ న్యాయం చేస్తాం

ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

పామిడి, జూలై 10 : ఎన్నికల సంగ్రామంలో శక్తివంచన లేకుండా శ్రమించిన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో బుధవారం పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రభుత్వ చౌకధాన్యపు డిపో డీలర్లు సమయపాలన పాటించాలని, రేషన్ కార్డు లబ్ధిదారుల పట్ల మర్యాదగా నడుచుకోవాలని సూచించారు. లబ్ధిదారులతో దురుసుగా ప్రవర్తిస్తే వారిని అర్ధంతరంగా మారుస్తామని హెచ్చరించారు. అలాగే పార్టీకి ద్రోహం చేసిన వారు కనుమరుగవుతారని, పార్టీ బలోపేతానికి కృషి చేసిన వారికి సముచిత స్థానం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. టీడీపీ నాయకులు ప్రజల సమస్యల పరిష్కారదిశగా ఉండాలని, సమస్యగా మారకూడదన్నారు. అక్రమ కేసులు పెట్టి వేధిస్తే సహించమని హెచ్చరించారు. పట్టణం, గ్రామీణ ప్రాంతాలలో ప్రజలు ఎదు ర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి బొల్లు శ్రీనివాసరెడ్డి, నాయకులు ప్రభాకర్ చౌదరి, దాసరి లక్ష్మీకాంతమ్మ, జింకల సంజీవకుమార్, మున్సిపల్ మాజీ చైర్మన్ గౌస్‌పీరా, జనసేన మండల అధ్యక్షుడు ధనుంజయ, ఆర్ఆర్ రమేష్, మహబూబ్‌బాషా, అప్పన్నగారి కుమార్, శివ, ప్రతాప్‌యాదవ్, ఓబుళకృష్ణయ్య, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాన్ని రక్షించండి

వామపక్ష నాయకుల డిమాండ్

పామిడి, జూలై 10 : పట్టణంలోని నూతన ఆర్టీసీ బస్టాండ్ సమీపాన ఎంతో విలువైన ప్రభుత్వ భూమిని సంరక్షించాలని వామపక్ష నాయకులు కే రహీం, అనిమిరెడ్డి డిమాండ్ చేశారు. పట్టణంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం ఈఓ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. నూతన ఆర్టీసీ బస్టాండ్ వద్ద సుమారు 71సెంట్లు ప్రభుత్వ స్థలం ఉందన్నారు. ఆ స్థలం ఆక్రమణకు గురవుతోందన్నారు. సర్వే చేయించి హద్దులు ఏర్పరచి స్వాధీనం చేసుకోవాలని వారు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు కే రహీం, సీపీఎం సీనియర్ నాయకులు అనిమిరెడ్డి, సీపీఐ మండల కార్యదర్శి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రామగిరిలో ఉచిత పశువైద్య శిబిరం

పామిడి, జూలై 10 : పాడి రైతులకు సెమెస్ ఇంజక్షన్ ఓ వరంలాంటిదని డీఎల్‌డీఏ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, ఉపసంచాలకులు డాక్టర్ టీవీ సుధాకర్ పేర్కొన్నారు. మండలంలోని రామగిరి గ్రామంలో బుధవారం పశువులకు ఉచిత గర్భకోశ చికిత్స శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 38 పాడి పశువులకు గర్భకోశ పరీక్షలు నిర్వహించి జబ్బులను బట్టి వైద్యం, మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఆయా జబ్బులు తిరిగి రాకుండా నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎద్దులపల్లి పశువైద్యాధికారి డాక్టర్ బీ సాయిసుప్రజ, సహాయ సంచాలకులు డాక్టర్ పీ భారతి, డాక్టర్ ఉషాకిరణ్, ఏహెచ్ఏ గోపాల మిత్రలు, పాడి రైతులు తదితరులు పాల్గొన్నారు.

ముద్దచర్మవ్యాధి నిర్మూలనకు టీకాలు

గుమ్మఘట్ట, జూలై 10: మండలంలోని కలుగోడు, ఆర్ కొత్తపల్లి, గలగల, గొల్లపల్లి పశువైద్యాధికారి నవీన్ ఆధ్వర్యంలో బుధవారం పశువులకు ముద్దచర్మ వ్యాధి టీకాలు వేశారు. గొర్రెలు, మేకలు కాపరులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కాంపౌండర్ ప్రహ్లాద, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

బ్రహ్మసముద్రం: మండలంలోని పశుసంవర్ధకశాఖ సిబ్బంది బుధవారం మండలపరిధిలోని గ్రామాల్లో పశువులకు ముద్దచర్మవ్యాధి నివారణ టీకాలను వేసినట్లు పశువైద్యాధికారి నవీన్ తెలిపారు. పశువైద్యసిబ్బంది మూడు బృందాలుగా ఏర్పడి ప్రతి పల్లెకు వెళ్లి ఈటీకాను పశువులకు వేస్తునట్లు పశువైద్యాధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డయేరియా మరణాలను నివారించడమే లక్ష్యం

రాయదుర్గం అర్బన్ వైద్యాధికారి

రాయదుర్గం, జూలై 10: అతిసారం(డయేరియా) మరణాలను నివారించడమే లక్ష్యంగా స్టాప్ డయేరియా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రాయదుర్గం అర్బన్ వైద్యాధికారి డాక్టర్ రమేష్ తెలిపారు. స్థానిక కణేకల్లు యూపీహెచ్‌సీలో బుధవారం స్టాప్ డయేరియా, డెంగీ వ్యతిరేక మాసోత్సవాలపై ఆయన ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలకు దిశానిర్దేశం చేశారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, కలుషితనీరు, ఆహారం చేతుల శుభ్రత గురించి ఆయా ప్రాంతాల్లో సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించాలని తెలిపారు. మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ నాగేంద్రప్రసాద్, యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఆజాద్, సూపర్‌వైజర్ లక్ష్మీనరసమ్మ, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా దుకాణాలు నిర్వహిస్తే చర్యలు : ఈఓ పీఆర్డీ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

యాడికి, జూలై 10: గ్రామ పంచాయతీ స్థలంలో అనుమతులు లేకుండా దుకాణాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని ఈఓపీఆర్‌డీ వెంకటేష్, సర్పంచు అనురాధ తెలిపారు. పంచాయతీ స్థలంపై వైసీపీ నాయకుల పెత్తనం శీర్షికన బుధవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. యాడికిలోని సంతమార్కెట్‌లోని పంచాయతీ స్థలంలో నిర్వహిస్తున్న గుజరీ దుకాణ యజమానితో వివరాలు ఆరాతీశారు. పంచాయతీ స్థలంలో నుంచి గడువులోగా ఖాళీ చేయాలని నిర్వాహకుడికి సూచించారు.

'మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించండి'



గుత్తిలో మొక్క నాటుతున్న సీడీపీఓ ఢిల్లీశ్వరి

గుత్తి, జూలై 10: మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని అధికారులు పిలుపునిచ్చారు. హరితవనంలో భాగంగా బుధవారం స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో ఆవరణంలో అధికారులు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ ఢిల్లీశ్వరి, సూపర్‌వైజర్ నాగేశ్వరి, అంగన్‌వాడీ వర్కర్లు, సబ్ రిజిష్టర్ గురున్నాథ్, సిబ్బంది ఆశ్లాబకాష్, ప్రమీళ, నరేంద్ర, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ: ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలని ఎంపీడీవో సుబ్బరాజు పేర్కొన్నారు. పట్టణంలోని బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో బుధవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో ఈశ్వరయ్య, కార్యదర్శి గౌస్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

పండ్ల మొక్కల సాగుకు ప్రోత్సాహం: ఎంపీడీఓ

బొమ్మనహాళ్, జూలై 10: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా రైతులను పండ్ల మొక్కల సాగుకు ప్రోత్సహిస్తున్నట్లు బొమ్మనహాళ్ ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రఘునాథ్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బందితో బుధవారం సమావేశం నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఐదెకరాల్లోపు ఉన్న రైతులను పండ్లమొక్కల సాగుకు ప్రోత్సహించాలని సూచించారు. మూడేళ్ల పాటు ప్రభుత్వమే ఖర్చు భరిస్తుందని తెలిపారు. మెట్టపొలాలు ఉన్న రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యానవన పంటలు సాగుకు ప్రోత్సాహం ఇస్తాయని తెలిపారు. సమావేశంలో ఏపీఓ రమేష్, ఈసీ రాజేష్‌కుమార్, టెక్నికల్ అసిస్టెంట్లు బ్రహ్మయ్య, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గంరూరల్ : మొక్కలు నాటి రేపటి భవిష్యత్తుకు పునాదులు వేయాలని ఎంపీడీఓ సాల్మన్‌రాజ్ అన్నారు. మండల పరిధిలోని బోరంపల్లి సమీపంలో ఉన్న పాలిటెక్నిక్ కళాశాల వద్ద బుధవారం అవెన్యూ ప్లాంటేషన్ కింద రోడ్డు కిరువైపులా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమానికి టీడీపీ రూరల్ మండల పార్టీ కన్వీనర్ గోళ్ల వెంకటేశులు, సర్పంచ్ శోభారాణి, నాయకులు వెంకటేశులు, మారెప్ప, రంగా రెడ్డి, ఆదినారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఔదార్యం

కళ్యాణదుర్గం(కంబదూరు), జూలై 10 : కంబదూరు మండలంలోని నూతిమడుగు ఉన్నత పాఠశాలలో 1989-90 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఔదార్యం చాటుకున్నారు. వారు చదివిన పాఠశాలకు తమ వంతుగా రూ. 30 వేలు వితరణ చేశారు. వాటితో పాటు రూ. పది వేలు విలువ చేసేపది కుర్చీలను నూతిమడుగు గ్రామానికి చెందిన పాఠశాల పూర్వ విద్యార్థి నిహాస్ ప్యూరిఫైడ్ డ్రింకింగ్ వాటర్ యజమాని సుధాకర్ వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో టీచర్ గురుమూర్తి, లాయర్ ముత్యాలప్ప, ఆర్ఎంపీ డాక్టర్ అనిల్, నిహాస్, వాటర్ ప్యూరిఫైడ్ ప్రొప్రైటర్ సుధాకర్, ఈటీ గోవిందు, టీచర్ భువనేంద్ర పాల్గొన్నారు. వీరికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజశేఖర్ రెడ్డి, పాఠశాల కమిటీ ఛైర్మన్ మారుతి, శివరాం, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలియజేశారు.

లయన్స్‌క్లబ్ అధ్యక్షుడిగా చల్లా సూర్యనారాయణ

యాడికి, జూలై 10: రాయలచెరువు లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా చల్లా సూర్యనారాయణను ఎన్నుకున్నారు. రాయలచెరువులోబుధవారం నిర్వహించిన కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చల్లా సూర్యనారాయణ, సెక్రటరీగా రామకృష్ణ, ట్రెజరర్‌గా రామ్మోహన్‌రెడ్డిలను ఎన్నుకున్నారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన చల్లా సూర్యనారాయణ మాట్లాడుతూ రాయలచెరువు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించారని తెలిపారు. ఉచిత వైద్యశిబిరాలు, ఉచిత కంటి వైద్యశిబిరాలు పేదలకు బాసటగా నిలిచారని తెలిపారు.

కేంద్రం మా డిమాండ్లను నెరవేర్చాలి: అంగన్‌వాడీలు



పామిడిలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు

గుంతకల్లుటౌన్/ పామిడి/ బెళుగుప్ప/ బొమ్మనహాళ్/ పుట్లూరు, జూలై 10: అఖిల భారత కోర్కెల దినం సందర్భంగా అంగన్ వాడీలకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్, సీఐటీయూ నాయకులు బుధవారం డిప్యూటీ తహసీల్దారు సువర్ణకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మా ట్లాడుతూ.... రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో అంగన్‌వాడీలను బలవంతంగా రాజీనా మాలు చేయాలని అధికార పార్టీ నాయకులు బెదిరిస్తున్నారని ఆరోపించారు. అలాగే అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ అమలు చేయాలని, కనీస వేతనాలు రూ.26వేలు, పెన్షన్, పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలనే పలు డిమాండ్లను నెరవేర్చాని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో సీఐటీయూ పట్టణ అధ్యక్షుడు కసాపురం రమేష్, మండల అధ్యక్ష, కార్యదర్శులు గంగా, రేష్మా, కమిటీ సభ్యుడు రమేష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే పామిడి పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. బెళుగుప్ప తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ హరనాథ్‌రావుకు వినతిపత్రం ఇచ్చారు. యూనియన్ కార్యదర్శి సత్యవతి, సెక్టారు లీడర్లు తిలోత్తమ, రాధ, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. బొమ్మనహాళ్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో అధికారికి అంగన్‌వాడీ సంఘం నాయకులు లావణ్య, జడెమ్మ తదితరులు వినతి పత్రం అందజేశారు. పుట్లూరు తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేసిన వారిలో అంగన్‌వాడీ యూనియన్ నాయకులు జయలలిత, శశికళ తదితరులు పాల్గొన్నారు.

హౌసింగ్ కాంట్రాక్టర్ మోసం చేశాడు

- పోలీస్ స్టేషన్‌లో లబ్ధిదారులు, హౌసింగ్ ఏఈ ఫిర్యాదు



సీఐ నాగార్జునరెడ్డికి సమస్యను విన్నవిస్తున్న లబ్ధిదారులు

యాడికి, జూలై 10: ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేస్తానని తమతో డబ్బులు కట్టించుకొని పనులు చేయకుండా మోసం చేశాడని జగనన్న హౌసింగ్ కాంట్రాక్టర్‌పై యాడికికి చెందిన లబ్ధిదారులు, హౌసింగ్ ఏఈ వేర్వేరుగా పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఈ మేరకు వారు బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు అందజేశారు. ఈ సందర్భంగా హౌసింగ్ లబ్ధిదారులు మాట్లాడుతూ.... మండలకేంద్రం సమీపంలోని జగనన్న లేఔట్‌లో ఇళ్లు మంజూరైన వారికి ఇళ్లు నిర్మించి ఇస్తామని సంబంధిత కాంట్రాక్టర్ తమతో అదనంగా రూ.35వేలు కట్టించుకున్నారన్నారు. అయితే ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభం నుంచి నత్తనడకన సాగుతున్నాయని తెలిపారు. దీనిపై పలుమార్లు ధర్నాలు చేశామన్నారు. కాంట్రాక్టర్ ఇళ్ల నిర్మాణ పనులు నాసిరకంగా చేశాడని వారు ఆరోపించారు. కొన్ని ఇళ్ల పై కప్పులు వంగిపోయాయని తెలిపారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సరిచేస్తామని చెబుతూ కాలయాపన చేశారన్నారు. ఇప్పుడు కాంట్రాక్టర్ పనులు చేయకుండా వెళ్లిపోయాడని తెలిపారు. దీంతో ఇళ్ల నిర్మాణాలు ఆగిపోయాయని వాపోయారు. కాంట్రాక్టర్‌కు అదనపు డబ్బులు ఇచ్చేందుకు వడ్డీలకు అప్పు తెచ్చి ఇచ్చామని, ఇప్పుడు తమ పరిస్థితి ఏమిటని ఆవేదన వ్యక్తం చేశారు. మోసం చేసిన కాంట్రాక్టర్‌పై ఫిర్యాదు చేయడానికి వచ్చామని లబ్ధిదారులు తెలిపారు.

అప్పులు తెచ్చి అదనపు డబ్బు ఇచ్చా



కాంట్రాక్టర్‌కు అదనపు డబ్బును వడ్డీకి అప్పు తెచ్చి ఇచ్చాను. ఇంటి నిర్మాణ పనులు మధ్యలోనే ఆపివేసి వెళ్లాడు. ఇప్పుడు నా పరిస్థితి ఏమి కావాలి? మా లాంటి పేదల డబ్బు దోచేయడం న్యాయమా? దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయడానికి వచ్చాం. కాంట్రాక్టర్‌పై కేసు నమోదుచేయాలి.

- నాగూర్‌బీ, హౌసింగ్ లబ్ధిదారురాలు, యాడికి

మా డబ్బులు వెనక్కు ఇప్పించాలి



సొంత ఇల్లు తయారవుతుందని అప్పుచేసి కాంట్రాక్టర్‌కు అదనపు డబ్బు చెల్లించాం. పనులు పూర్తి చేయకుండా చేతులెత్తేశాడు. ఇప్పుడు మా పరిస్థితి ఏంటి. మాకు న్యాయం కావాలి. మా డబ్బు వెనక్కు ఇప్పించాలి.

- లక్ష్మీదేవమ్మ, హౌసింగ్ లబ్ధిదారురాలు, యాడికి

కాంట్రాక్టర్‌పై కేసు నమోదుకు ఫిర్యాదుచేశా



హౌసింగ్ పనులు పూర్తిచేయకుండా వెళ్లిన కాంట్రాక్టర్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశా. పనులు పూర్తిచేయడంలో అలసత్వం వహించాడు. లబ్ధిదారులతో అదనపు డబ్బు కట్టించుకున్నాడు. లబ్ధిదారులకు మోసం జరిగిందని గ్రహించాం. కాంట్రాక్టర్‌పై కేసు నమోదుకు ఫిర్యాదు చేశా.

- ప్రశాంత్‌కుమార్, హౌసింగ్ ఏఈ

తాగునీటి కోసం ఆందోళన



డీఈ హేమచంద్రతో మాట్లాడుతున్న మహిళలు

గుత్తి, జూలై 10: తమ కాలనీలో తాగునీటి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పట్టణంలోని దాసరికాలనీకి చెందిన మహిళలు స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద బుధశారం ఆందోళన చేపట్టారు. అనంతరం డీఈ హేమచంద్రతో వాగ్వివాదానికి దిగారు. గత 20 రోజులుగా తాగునీరు సరఫరా కాక తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. తమ కాలనీకి నీటిని ఎందుకు సరఫరా చేయడం లేదని కాలనీ మహిళలు లక్ష్మీదేవి, శ్రీదేవి, హేమవతి ఆగ్రహం వ్యక్తం చేశారు. తామ కాలనీకి వెంటనే నీటిని సరఫరా చేయాలని అధికారులతో వాగ్వాదానికి దిగారు. తక్షణమే కాలనీకి నీటిని సరఫరా చేస్తామని చెప్పడంతో కాలనీ మహిళలు వెనుదిరిగారు.

ఆధిపత్యం కోసమే వైసీపీ హత్యా రాజకీయాలు

కాలవ భరత్ ధ్వజం



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న కాలవ భరత్

రాయదుర్గం రూరల్, జూలై 10: అధికారం కోల్పోయిన వైసీపీ నాయకులు పల్లెల్లో ఆధిపత్యం నిరూపించుకోవడం కోసం హత్యా రాజకీయాలకు పాల్పడుతున్నారని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తనయుడు కాలవ భరత్ తీవ్రంగా మండిపడ్డారు. ఆయన బుధవారం దారుణహత్యకు గురైన ఆదికేశవులు మృతదేహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను ఓదార్చి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా కాలవ భరత్ మాట్లాడుతూ హత్యకు పాల్పడిన ఎంతటి వారినైనా సహించేది లేదని వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ హనుమంతు, డీ.హీరేహాళ్ మండల కన్వీనర్ హనుమంతరెడ్డి, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దేవాలయ భూముల వేలం పాటలో ఉద్రిక్తత



వేలం పాట వద్ద పోలీసుల బందోబస్తు

ఉరవకొండ, జూలై 10: వజ్రకరూరు మండలంలోని పొట్టిపాడు గ్రామంలో దేవాలయ భూముల వేలం పాటలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. గ్రామంలోని సుంకులమ్మ, ఆంజనేయస్వామి, విశ్వేశ్వరస్వామి, శివాలయస్వామి ఆలయాలకు సంబం. దించిన 65ఎకరాలకు బుధవారం వేలం పాట నిర్వహించారు. ముందస్తుగానే భారీగా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. దేవాదాయశాఖ అధికారులు కృష్ణయ్య, రమేష్ ఆధ్వర్యంలో వేలం పాట ప్రారంభం కాగానే గ్రామంలోని ఒక వర్గం వేలం నిర్వహించాలని, మరో వర్గం వద్దని అభ్యంతరం తెలిపారు. ఇరువర్గాలు వాగ్వాదానికి దిగారు.. సీఐ ప్రవీణ్ కుమార్ సర్ది చెప్పారు. వేలం పాటను వాయిదా వేస్తున్నట్లు ఈవో కృష్ణయ్య తెలిపారు.

భూ సంరక్షణపై అవగాహన ఉండాలి

సైంటిస్ట్ డాక్టర్ సుందానంద్



మొక్క ఎదుగుదలపై రైతులకు అవగాహన కల్పిస్తున్న సైంటిస్ట్ డాక్టర్ బి సుందానంద్

కళ్యాణదుర్గం (కంబదూరు), జూలై 10 : భూ సంరక్షణ, భూ యాజమాన్యంపై ప్రతి రైతు కనీస అవగాహన కలిగి ఉండాలని, అప్పుడే పంటలు దిగుబడి సాధించేందుకు అవకాశం వుంటుందని శాస్త్రవేత్త డాక్టర్ బి సుందానంద్ తెలిపారు. శ్రీప్రియ ఫర్టిలైజర్స్ యజమాని ప్రభాకర్ ఆధ్వర్యంలో బుధవారం జైకిసాన్ ఎరువులు కంపెనీ సారథ్యంలో రైతులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పంట ఎదుగుదలకు ఏ మందు పిచికారి చేయాలి. ఎటువంటి ఉపయోగాలు వుంటాయనేది వివరించారు. జైకిసాన్ ఎరువుల ఉపయోగంపై రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో రీజనల్ మేనేజర్ ఎంసీ గిరీష్, ఎండీవో శరణ్ బసు కంభవి, ఏఎంఎం రాజేష్, జూనియర్ ఆగ్రోనిస్ట్ కిరణ్ కుమార్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభా విద్యార్థులకు బహుమతుల ప్రదానం



బహుమతులను చూపుతున్న విద్యార్థులు

తాడిపత్రి, జూలై 10: గత పదో తరగతి పరీక్షల్లో మంచి ప్రతిభ చూపిన పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులకు పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో బుధవారం నగదు బహుమతులు అందజేశారు. 549, 538, 498 మార్కులు సాధించిన వజీర్ బాబా, రబ్బానీ, కీర్తనకు వరుసగా రూ.5వేలు, 3వేలు, 2వేలు నగదు బహుమతులను అందజేసినట్లు సంఘం అధ్యక్షుడు సత్యప్రసాద్‌రెడ్డి తెలిపారు.

పెద్దవడుగూరు: మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో గత పదవతరగతి పరీక్షల్లో ప్రతిభ చూపిన భవాని, సింధుజ అనే విద్యార్థినులకు బుధవారం నగదు బహుమతులు అందించారని ప్రధానోపాధ్యాయుడు సుధాకర్‌బాబు తెలిపారు. మండలకేంద్రానికి చెందిన రామసుబ్బమ్మ వారి అక్క చెన్నమ్మ జ్ఞాపకార్థం విద్యార్థులకు నగదు బహుమతులతోపాటు మెమోంటోలను అందించారన్నారు.

'రైల్వే ప్రాంతాల్లో అడ్డుగోడలను తొలగించాలి'



ధర్నా నిర్వహిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

గుంతకల్లుటౌన్, జూలై 10: పట్టణంలోని మస్తాన్‌పేట, బెంచికొట్టల, పోర్టర్‌లైన్ ఏరియాలో రైల్వే అధికారులు ప్రహరీల మధ్య నిర్మించిన అడ్డుగోడలను వెంటనే తొలగించాలని ప్రజా సంఘా ల నాయకులు డిమాండ్ చేశారు. పట్టణ పౌరుల సంక్షేమ సంఘం, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్, ఐద్వా ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, కాలనీవాసులు కలసి బుధవారం రైల్వే డివిజన్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘాల నాయకులు మాట్లా డుతూ రైల్వే ప్రాంతాలలో వెళ్లేందుకు ఉన్న పాత రహదారులను రైల్వే అధికారులు మూసివేశార న్నారు. దీంతో పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, రైల్వే స్టేషన్‌కు వెళ్లే ప్రయాణికులు, డీఆర్ఎం కార్యాలయానికి వెళ్లే ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైల్వే అధికారులు వెంటనే అడ్డుగోడలను తొలగించాలని కోరారు. అనంతరం రైల్వే అధికారులకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘాల నాయకులు బీ శ్రీనివాసులు, మారుతిప్రసాద్, పరమేష్, సురేంద్రబాబు, జ్యోతి, రంగమ్మ, దాసరిశ్రీనివాసులు, తిమ్మప్ప, సాకేనాగరాజు, కసాపురం రమేష్, జగ్గలి రమేష్, రామునాయక్ తదితరులు పాల్గొన్నారు.